www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సంపుటి:02 సంచిక:31, సోమవారం, 20.11.2023



## 2 లక్షల నౌకర్లు ఇస్తం

### ఉద్యమకారులను ఆదుకుంటాం

- ఇందిరమ్మ రాజ్యం తెస్తాం
- బీఆర్ఎస్ ఆదివాసులకు చేసిందేంటి?
- జాబ్ కేలండర్ ప్రకారం ఉద్యోగాలు
- కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ

“ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ అన్నారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షల మేరకే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్, ఆసిఫాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభల్లో ఆమె మాట్లాడారు. తొలుత నాందేడ్ నుంచి హెలికాప్టర్‌లో ప్రియాంక ఖానాపూర్‌కు చేరుకున్నారు. ఈ సభలో ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు చేశారు.

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
ఉద్యమకారుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం “జల్, జంగల్, జమీన్ సంస్కృతి ఆదివాసీలది. అది ప్రపంచంలోనే అత్యున్నత సంస్కృతి. ఇందిరా గాంధీ హయాంలో గిరిజనులు, ఆదివాసీల హక్కులకు రక్షణ కల్పించే చట్టాలు చేశారు. అందుకే ఆమె మరణించి 40 ఏళ్లు గడిచినా.. చేసిన మంచి పనులను ఇప్పటికీ తలచుకుంటున్నారు. ఇంది రాగాంధీ స్థానం మీ మనసులో పదిలంగా ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. తెలంగాణను ఎలా ముందుకు నడిపించాలో కాంగ్రెస్‌కు తెలుసు. సిద్ధాంతాల ఆధారంగా నడిచే పార్టీ కాంగ్రెస్. ఈ రాష్ట్రంలో 40 లక్షల మంది నిరుద్యోగ యువత ఉన్నారు. వారికి ఉద్యోగాలు రాలేదు కానీ కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయి. నియామకాలు చేపడుతున్నామని చెప్పి పరీక్షలు నిర్వహించినా పేపర్ లీక్‌లు జరిగాయి. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ ప్రకారం నియామకాలు చేపడతామని మాటిస్తున్నాం. ప్రత్యేక రాష్ట్రంలో

..మిగతా 2 లో



## ఇందిరమ్మ రాజ్యంలో తిండి లేదు

- అదో దరిద్రమైన రాజ్యం
- మా పాలనలో వలసలు మాయం
- జూపల్లి చరిత్ర మొత్తం కక్ష సాధింపే
- ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

**విశాలభారతి స్టేట్ బ్యూరో:**
ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న కామెంట్స్‌కు కౌంటర్ ఇచ్చారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు కడుపునిండా తిండి కూడా దొరికేది కాదని ఎద్దేవా చేశారు. కొల్లాపూర్, కల్వకుర్తి, అలంపూర్, నాగర్ కర్నూల్ లలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యమా.. తోకమట్టనా అంటూ సెటైర్ వేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ఉన్నవి ఆకలి చావులే కదా అని గుర్తుచేశారు. ఇందిరమ్మ రాజ్యమంతా నక్సలైట్ల ఉద్యమాలు, ప్రజలను కాల్చి చంపడం, ఎన్‌కౌంటర్లే కదా అంటూ కౌంటర్ ఇచ్చారు. ఎన్టీ రామారావు పార్టీ పెట్టి రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చేంత వరకు చాలా మంది సగం కడుపుకే తినేవారని గుర్తు చేశారు. ఆ విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇందిరమ్మ రాజ్యమే బాగుంటే ఎన్టీ రామారావు ఎందుకు పార్టీ పెట్టే వారని కేసీఆర్

..మిగతా 2 లో

### కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి

## బీఆర్ఎస్‌కు వణుకు

- 6 గ్యారెంటీలు అమలు చేసి తీరుతాం
- ప్రజాదర్బార్ నిర్వహిస్తాం
- 110 స్థానాల్లో బీజేపీకి డిపాజిట్ గల్లంతు
- మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటేయండి
- మీట్ ది ప్రెస్ లో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి



..మిగతా 2 లో





## వట్టే జానయ్యపై కత్తులు, గొడ్డళ్ళతో దాడి

- అడ్డుకున్న డ్రైవర్ కు గాయాలు
- గట్టికల్ గ్రామంలో ఉద్రిక్తత
- బీఆర్ఎస్ నేతల పనేనని బీఎస్పీ ఆరోపణ
- పట్టించుకోని పోలీసులు

**సూర్యాపేట, విశాలభారతి:**
సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు (ఎస్) మండలం గట్టికల్లు గ్రామంలో ఆదివారం రాత్రి బిఎస్పి సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ పై కొంతమంది గోడ్డల్లు, కత్తులతో దాడి చేశారు. దీంతో వట్టె జానయ్య తృటిలో తప్పించుకోగా, పక్కనే తన కారు డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. జానయ్య పై గొడ్డళ్లు, కత్తులతో దాడి చేసింది బిఆర్ఎస్ కార్యకర్తలు అని బీఎస్పీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. దాడి ఘటన పై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారని,దాడి చేసిన వారిపై వట్టె జానయ్య యాదవ్ ఫిర్యాదు చేసిన పోలీసులు స్పందించలేదని భాదితులు అవేదన వ్యక్తం చేశారు. పోలీసుల పనితీరుకు గ్రామ ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహ వ్యక్తం చేశారు. కాగా బీఆర్ఎస్ నాయకులు తమకు సంబంధం లేదని జానయ్య యాదవ్ పై దాడి చేసిన వారు కాంగ్రెస్ పార్టీ కి చెందిన వారని సోషల్ మీడియా లో ప్రచారం చేస్తున్నారు. ఏది ఏమైనా పోలీస్ లు స్పందించి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తే అసలు దాడి వెనుక అంతర్యం బయటపెట్టాలని పలువురు పేర్కొన్నారు.

## విమర్శలు తేలిక.. ఆత్మ పరిశీలన అవసరం

### పార్టీ మార్పుపై విజయశాంతి స్పందన

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
పార్టీ మారారంటూ తనపై వస్తున్న విమర్శలను సినీనటి, మాజీ ఎంపీ విజయశాంతి ఖండించారు. భాజపాను వీడి కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో ఎక్స్(ట్విటర్) వేదికగా వివరించారు. ‘రాములమ్మ పార్టీ మారారు అని విమర్శించే వాళ్లు ఒకటి తెలుసుకోవాలి. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 7 సంవత్సరాలు జెండా మోసి కొట్లాడింది నేను. నాడు బండి సంజయ్, కిషన్‌రెడ్డి మరికొందరు భాజపా ప్రముఖులు అనేకసార్లు నా వద్దకు వచ్చి భారాస అవినీతిపై తప్పక చర్యలుంటాయని చెప్పారు. మీరందరూ సమర్థిస్తే కేంద్రంలోని భాజపా ఎంతవరకైనా కొట్లాడతది అని చెప్పి



..మిగతా 2 లో



## జనగామ ‘పల్లా’దే!

- సీఎం సభ సక్సెస్ తో గెలుపుపై ధీమా
- కలిసివస్తున్న సీనియర్లతో జోరుగా ప్రచారం
- గ్రామాల్లో బ్రహ్మరథం పడుతున్న ప్రజలు
- పదునైన వ్యూహాలతో ప్రత్యర్థులకు చెక్
- అటు ప్రజా క్షేత్రంలో.. ఇటు సోషల్ మీడియాలో దూకుడు

..మిగతా 2 లో

## డబ్బు సంచులతో వచ్చెటోళ్లను నమ్మొద్దు

- ఖమ్మం జిల్లాలకు బీఆర్ఎస్ ఎంతో చేసింది
- ఈ సారి మమ్మల్ని గెలిపించండి
- 24 గంటల కరెంట్ ఇస్తున్నం
- భద్రాచలంలో ఐటీ మంత్రి కేటీఆర్ రోడ్ షో



**విశాలభారతి స్టేట్ బ్యూరో:**
డబ్బు సంచులతో వచ్చెటోళ్లను నమ్మొద్దని ఐటీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం భద్రాచలంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. భద్రాచలంలో ఈసారి బీఆర్ఎస్ ని గెలిపించాలని పిలుపునిచ్చారు మంత్రి కేటీఆర్. భద్రాచలంలో ఇంతవరకు బీఆర్ఎస్ బోణీ కొట్టలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో ఇతర పార్టీల్లో గెలిచినవారు బీఆర్ఎస్ వైపు వచ్చారు కానీ, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాత్రం కాంగ్రెస్‌లోనే ఉన్నారు, ఈసారి కూడా ఆయన కాంగ్రెస్ నుంచే పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ తరపున తెల్లం వెంకట్రావు మరోసారి బరిలో దిగారు. వెంకట్రావుకి మద్దతుగా మంత్రి కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈసారి భద్రాచలంలో బీఆర్ఎస్ ని గెలిపించాలని కోరారు. చిన్న చిన్న అసంతృప్తులను పక్కనపెట్టి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని భద్రాచలం ప్రజలకు పిలుపునిచ్చారు మంత్రి కేటీఆర్. 11 సార్లు గెలిచిన కాంగ్రెస్ 24 గంటల కరెంట్

..మిగతా 2 లో



# 2 లక్షల నౌకర్లు ఇస్తాం

**మొదటిపేజీ తరువాయి**

తమ జీవితాలు మారుతాయని ఉద్యమకారులు కలలు కన్నారు. కానీ అలా జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమకారుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం.

**ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం**

రాష్ట్రంలో కాళేశ్వరం, మిషన్ భగీరథ పేరిట దోపిడీ జరిగింది. ప్రభుత్వ సొమ్ము, ప్రజల సొమ్ము వేర్వేరు కాదు. కేంద్ర ప్రభుత్వం బడా వ్యాపార వేత్తలకు రుణమాఫీ చేసింది. కానీ, రైతులకు రుణమాఫీ చేయ డానికి మాత్రం నిధులు లేవని చెబుతోంది. ప్రధాని నరేంద్రమోదీ భారాస ప్రభుత్వ అవినీతిపై దృష్టి సారిం చకుండా కాంగ్రెస్ నేతల ఇళ్లపైకి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నారు. భాజపా, భారాస ఒక్కటి కాబట్టి అలా చేస్తున్నారు. పార్లమెంటులో భారాస ఎంపీలు కేంద్రం ప్రవేశపెట్టిన పలు బిల్లులకు మద్దతుగా ఓటేశారు. ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ రాష్ట్రంలో కేసీఆర్‌కు, కేంద్రంలో భాజపాకు సహకరిస్తున్నారు. ఈ మూడు పార్టీలు ఒక్కటే. మహిళలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. వారి కష్టాన్ని గుర్తించే మ్యానిఫెస్టోలో పలు అంశాలను చేర్చాం. ప్రతి నెలా రూ.2500 వారి ఖాతాలో వేయాలని నిర్ణయించాం. రూ.500లకే గ్యాస్ సిలిండర్, బస్సుల్లో ఉచిత రవాణా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రూ.15వేల రైతు బంధు, రూ.10లక్షల ఆరోగ్య బీమా, పంటలకు మద్దతు ధర ఇలాంటి పథకాలతో కూడిన ఆరు గ్యారం టీలు అమలు చేస్తాం'' అని ప్రియాంక అన్నారు.

**కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలు**

అనంతరం ఆసిఫాబాద్ సభలో ప్రియాంక మాట్లా డారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే యువతకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామ న్నారు. ''ధరణి ద్వారా రైతులను, ప్రజలను భారాస మోసం చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జాబ్ క్యాలెండర్ ఇస్తాం. పరీక్ష తేదీలు, ఫలితాల ప్రకటన తేదీలు జాబ్ క్యాలెండర్‌లో ఉంటాయి. తెలంగాణ యువతకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తాం. ఆసి ఫాబాద్ ప్రజలకు బీఆర్ఎస్ ఏం చేసిందో చెప్పాలి?'' అని ప్రశ్నించారు.

# డబ్బు సంచులతో వచ్చెటోళ్లను నమ్మొద్దు

**మొదటిపేజీ తరువాయి**

ఇచ్చిందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారం లోకి వచ్చిన తొలి విడతలోనే రైతులకు 24 గంటల విద్యుత్ ఇచ్చామని చెప్పారు. తెలంగాణలో మరోసారి రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

భద్రాచలం వచ్చినప్పుడు రాముడి పాదాలకు నమస్కరించాలనుకున్నానని, అధికారుల విజ్ఞప్తి మేరకు వెళ్లలేదని చెప్పారు కేటీఆర్. తొందర్లోనే మళ్లీ వచ్చి రామయ్య దర్శనం చేసుకుంటానని చెప్పారు. కారణాలు ఏవైనా భద్రాచలంలో ప్రజలు తమకు అవకాశం ఇవ్వలేదని, ఈసారి కచ్చితంగా గులాబీ వనంలోకి భద్రాచలం చేరాలని చెప్పారు. ఈసారి బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావును గెలిపిస్తే, వరదల ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపి స్తామన్నారు. యాదాద్రి కంటే గొప్పగా.. భద్రాచలం రామాలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కొంతమంది డబ్బు సంచులతో వస్తున్నారని, అలాంటి వారి మాటలు నమ్మొద్దని చెప్పారు.

# నంబర్ వన్ అని చెప్పుకోవడానికి సిగ్గుండాలి

- కాంగ్రెస్ నేత, సీఎల్పీ భట్టి విక్రమార్క



**విశాలభారతి, హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో పడేసి ప్రజల ప్రభుత్వం తెచ్చుకో వాలని రాష్ట్ర ప్రజలు సిద్ధమయ్యారని కాంగ్రెస్ నేత, సీఎల్పీ భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మధిర సెగ్మెంట్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీలో మాట్లాడారు. నోరు తెరిస్తే అద్భుత ప్రాజెక్ట్ అని గొప్పలు చెప్పుకున్న కాళేశ్వరం కుంగుబాటుపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులు ఇప్పుడు నోరు విప్పకపోవడం సిగ్గుచేటన్నా రు. కాళేశ్వరం నిర్మాణం పేరిట లక్ష కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన దోపిడీ అధికారంలోకి రాగానే కక్కి స్తామన్నారు. మేడిగడ్డ మాదిరిగానే అన్నారం సుందిళ్ల ప్రాజెక్టులు కుంగిపోతున్నాయని నీళ్ళను నింపడానికి ఆ ప్రాజెక్టులు పనికిరావని జాతీయ సేఫ్టీ అధికారులు తేల్చి చెప్పారని దానిపై ఎందుకు విచారణకు కేసీఆర్ సిద్ధం కావడం లేదని నిలదీశారు. పదేళ్లుగా తెలంగాణ సంపదను బీఆర్ఎస్ పాలకులు దోపిడీ చేసినందునే ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన సంక్షేమాలకు సైతం కోత పెట్టారని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇంట్లో ఉన్న ఇద్దరికీ పింఛన్లు ఇస్తే.. ధనిక రాష్ట్రంలో ఒకరికి కోత కోసి ఒకరికి మాత్రం ఇస్తూ సంక్షేమంలో నెంబర్ వన్ అని చెప్పుకోవడానికి సిగ్గుండాలి అన్నారు.

## కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి
# బీఆర్ఎస్‌కు వణుకు

**విశాలభారతి స్టేట్ బ్యూరో:** కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి బీఆర్ఎస్ కు భయం పట్టుకుందని, అధికారం కోల్పో తున్నామనే సీఎం కేసీఆర్ ఆలోచన లేకుండా విచక్షణా రహితంగా మాట్లాడుతున్నారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆధ్వర్యంలో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీలు సహా మేనిఫెస్టోలో పొందు పరిచిన హా మీలన్నింటినీ నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తా మని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో బీజేపీకి 105 స్థానా ల్లో డిపాజిట్లు గల్లంతు కాగా, ఈసారి 110 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతవుతాయంటూ జోస్యం చెప్పారు. అసలు డిపాజిట్లే రాని పార్టీ బీసీని ఎలా ముఖ్యమంత్రి ని చేస్తుందంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ 10 రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే ఒకరు మాత్రమే ఓబీసీ సీఎంగా ఉన్నారని గుర్తు చేశారు.

**'బీజేపీ పట్టించుకోలేదు'**

బీసీ గణన చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నా, బీజేపీ పట్టించుకోలేదని, అలాంటి పార్టీ బీసీని ఎలా సీఎం చేస్తుందని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల కోసమే ఎస్సీ వర్గీకరణ హామీ ఇచ్చిందని, ఎన్నికల య్యాక అసలు ఆ విషయమే బీజేపీ పట్టించుకోదని మండిపడ్డారు. బీజేపీ మాటలను దళితులెవరూ నమ్మరని అన్నారు. అటు, 'ధరణి' పేరుతో కేసీఆర్ కుటుంబం లక్షన్నర ఎకరాలను దోచుకుందని ఆరో పించారు. రాష్ట్రంలో రైతులకు కేవలం 8 నుంచి 10 గంటలు మాత్రమే కరెంట్ ఇస్తున్నారని చెప్పారు. రైతు రుణమాఫీ చేయాలన్న శ్రద్ధ కేసీఆర్ కు లేదని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం ఆధిపత్య ధోరణితో ముందుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**'కేసీఆర్ ను గద్దె దించాలి'**

పదేళ్లుగా తెలంగాణ ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ, సమానత్వం, సమాన అభివృద్ధి అందలేదని, అందుకే మరోసారి ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేశారు. నిరంకుశ నిజాంకు పట్టిన గతే కల్వకుంట్ల కుటుంబానికి తెలంగాణ ప్రజలు రుచి చూపించబోతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలకు ఇదే చివరి ఉద్యమం కావాలని, ప్రజలను బానిసల్లా చూస్తోన్న కేసీఆర్ ను గద్దె దించాలని పిలుపునిచ్చా రు. ప్రాజెక్టుల నిర్మాణం విషయంలోనూ నిపుణుల సలహాలు తీసుకోలేదని ధ్వజమెత్తారు. తెలంగాణ ఆత్మ గౌరవం కాపాడడం కోసం రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు.

**'ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మేనిఫెస్టో'**

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ మేనిఫెస్టో రూపొందించామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. 2 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని, యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెం డర్ ప్రకటిస్తామని, విద్య, వైద్యం, వ్యవసాయం రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేస్తామని, మహిళ లకు చేయూత అందిస్తామని వివరించారు. మార్పు రావాలంటే కాంగ్రెస్ కు ఓటేసి గెలిపించాలని ప్రజ లకు విజ్ఞప్తి చేశారు.

# జనగామ 'పల్లా'దే!

## సీఎం సభ సక్సెస్ తో గెలుపుపై ధీమా

- కలిసివస్తున్న సీనియర్లతో జోరుగా ప్రచారం
- గ్రామాల్లో బ్రహ్మరథం పడుతున్న ప్రజలు
- పదునైన వ్యూహాలతో ప్రత్యర్థులకు చెక్
- అటు ప్రజా క్షేత్రంలో.. ఇటు సోషల్ మీడియాలో దూకుడు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేప థ్యంలో.. పార్టీలన్ని ప్రచారంపై ఫోకస్ పెట్టాయి. ఈ విషయంలో అధికార బీఆర్ఎస్ పార్టీ అన్ని పార్టీలను వెనక్కు తోసేసి.. ప్రచారంలో దూసుకు పోతుంది. అందరి కంటే ముందుగా అభ్యర్థుల జాబితా ప్రకటించింది. దాదాపు సిట్టింగులకే మళ్లీ ఛాన్స్ ఇచ్చింది అధిష్ఠానం. కాగా.. టికెట్ ఆశించి భంగపడిన అసంతృప్తులు పార్టీ వీడుతున్నారు. ఈ క్రమంలోనే పలు చోట్ల సిట్టింగులను పక్కకు పెట్టారు. జనగామ టికెట్ ను సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డిని కాదని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఇచ్చారు కేసీఆర్. ఇక అప్పటినుంచి ఆయన నియోజకవర్గంపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. అటు ప్రజా క్షేత్రంలో.. ఇటు సోషల్ మీడియాలో దూసు కుపోతున్నారు.

**వ్యూహాలతో ప్రత్యర్థులకు చెక్**

జనగామ నియోజకవర్గ బీఆర్ ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డికి పరిస్థితులు అను కూలంగా మారాయి. సొంత పార్టీలోనే ఉన్న సీనియ ర్లను కలుపుకొని పోతున్నారు. జనగామ నియోజ కవర్గంలో కాంగ్రెస్ పార్టీ వేవ్, ప్రచార దూకుడుకు అనుగుణంగా పల్లా ప్రణాళికలతో దూసుకుపోతు న్నారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని చుట్టువచ్చారు. ఎమ్మెల్యే కావాలనే ఆశలతో జనగామ టికెట్‌ను ఏరి, కోరి కొట్లాడి మరీ సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి.. అదే స్థాయిలో క్షేత్రస్థాయి రాజకీయంలో తనకంటూ ప్రత్యేకత చాటుకుంటున్నారు. జనగామ బీఆర్ ఎస్‌లో ము త్తిరెడ్డి, పల్లా వర్గీయులు కలిసి ప్రచారం చేయడం కాంగ్రెస్ కు మింగుడుపడటం లేదు. క్షేత్రస్థాయి లోని పార్టీ క్యాడర్‌ను ముందుకు నడిపించడంలో పల్లా విజయం సాధించారు. ఈ పరిణామాలను పరిగణలోకి తీసుకుంటే పల్లాకు భారీ విజయం సాధించడం పక్కా అని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**ప్రచారంలో బ్రహ్మరథం**

కొమురవెల్లిలో ఎన్నికల ప్రచారంలో పల్లాకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఘన స్వాగతం పలికారు. స్థానిక యువకులు పల్లాకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే దూల్మిట్టలో కూడా పల్లాకు ప్రజలు నీరాజనాలు పలికారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులకు బాధ్యతలు అప్పజెప్పడంతోపా టు స్థానిక నాయకత్వంతో తానే స్వయంగా సమన్వ యం చేసుకుంటూ అన్నింటా తానై కాంగ్రెస్ పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తున్నాడు. ముత్తిరెడ్డి, పోచంప ల్లి అనుచరులకు ప్రాధాన్యం ఇవ్వడంపై నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జనగామ బీఆర్ ఎస్ పార్టీ కార్యక్రమాలకు, ప్రచారంలో కలిసికట్టుగా పా ల్గొంటున్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి భారీ విజయం సాధించడం పక్కా అని సొంత పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు.

**సీఎం సభ విజయం.. గెలుపుపై ధీమా**

శనివారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీ ర్వాద సభను విజయవంతం అయింది. ఇందుకోసం బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి... ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ఎమ్మెల్యే, రైతు బంధు చైర్మన్ తాటికొండ రాజయ్య తో కలిసి సమన్వయం చేయడంపై పార్టీ అధిష్టానం సంతృప్తి వ్యక్తం చేసింది. సభలో సీఎం ముందు ని యోజవర్గానికి కావాల్సిన అభివృద్ధి పనుల చిట్టాను పెట్టడం కలిసివచ్చింది. కేసీఆర్ చేర్యాల సభ విజ యవంతం కావడం.. ఎన్నికల్లో విజయానికి దారి వేస్తుందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయమై జనగామ సభలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు.

**సోషల్ మీడియాలో దూకుడు**

సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో ప్రచారం జరుగు తుండగా.. ఆయన చేసిన ట్వీట్లు.. అందులోని వీడి యోల్లో ఆయన వ్యాఖ్యలు ప్రజలను ఆలోచించేలా చే స్తున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి మద్దతు.. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో జనగామలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరవేసేందుకు వడివ డిగా అడుగులు వేస్తున్నారు. ముత్తిరెడ్డిని కలుపుకొ ని కార్యకర్తలను వెంటేసుకొని జనాల వద్దకు పల్లా రాజేశ్వర్ రెడ్డి వెళుతున్నారు. జనగామలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పదేళ్లుగా బాగా పని చేశారని చెప్పుకొ స్తూనే.. ఈసారి తనను ఆదరించాలని బీఆర్ఎస్ కు మద్దతుగా ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జనగామలో బీఆర్ఎస్ కు లక్ష మెజారిటీకి తక్కువ కాకుండా తెచ్చేందుకు వ్యూహా లతో దూసుకుపోతున్నారు.

**సేవలో ఆదర్శం**

ఇప్పటికే విద్యావేత్తగా ఎన్నో విద్యా సంస్థలు నడుపుతూ ఎంతో మందికి విద్యనందించిన జనగామ బిఆర్ఎస్ అభ్యర్థి డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి తన ఉదార, మానవ సేవా స్వభావాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారు. జనగామ ప్రజలకు రోజురోజుకు దగ్గరవుతున్నారు. వారి కోసం మరో సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆయన స్థాపించిన నీలిమ హాస్పిటల్ లో జనగామ నియోజకవర్గ ప్రజలకు పూర్తిగా ఉచిత వైద్య సదుపాయాలను అందిస్తున్నారు. ఇప్పటికే నియో జకవర్గంలోని ఎంతో మంది ప్రజలు నీలిమ హాస్పిటల్ లో ఉచిత వైద్య సదుపాయాలను వినియోగించుకుంటున్నారు. ఎమ్మెల్యే ఎన్నిక అవ్వకముందే ఇటువంటి సదు పాయాన్ని అందించిన రాజేశ్వర్ రెడ్డి ఎన్నికైతే ఇంకా ఎన్నో చేయగలడని ప్రజలు భావిస్తున్నారు. తమ ఓటు ఆయనకే వేస్తామని బాజప్తుగా చెబుతున్నారు.







# రైతుబంధు ఆపాలని నేను ఎక్కడా చెప్పలేదు



ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**విశాలభారతి, హైదరాబాద్:** రైతు బంధు ఆపాలని తాను ఎక్కడా చెప్పలేదని ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ..రైతు బంధును తాను ఆపాలని చెప్పినట్లు బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తుందన్నారు. గత నెలలో రైతుబంధు, దళిత బంధు, బీసీ బంధు, రుణమాఫీ లు నామినేషన్ ప్ర క్రియ కంటే ముందే విడుదల చేయాలని మాత్రమే డిమాండ్ చేశామని, ఎక్కడా ఆపాలని చెప్పలేద న్నారు. రైతు బంధు పెంచాలని కోరుతున్నామ న్నారు. ఒకేసారి 2 లక్షల రుణమాఫీ చేయాలని తమ మేనిఫెస్టోలో పెట్టామని, గతంలో ఒకే సారి రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కిందన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ దేశంలోనే మొదటిసా రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇచ్చామన్నారు. ఇప్పుడు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. మోడీ ,కేసీఆర్ లు రైతులకు అన్యాయం చేశారన్నారు. రైతుల ఆదాయం మోడీ డబుల్ చేస్తానని మాట తప్పారన్నా రు. రైతులకూ నష్టం జరిగితే పంట భీమా లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. లక్ష కోట్ల అప్పు తెచ్చి కాళే శ్వరం కడితే ఒక ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వక ముందే ప్రాజెక్టులు కూలిపోతున్నాయన్నారు. కాళేశ్వరంలో అవినీతి వల్లే నాణ్యత లోపం ఉన్నదన్నారు. కేసీఆర్ ఫ్యామిలీ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతనే ఓట్లు అడగాలని ఉత్తమ్ కుమార్ సవాల్ విసిరారు.

# ఇందిరమ్మ రాజ్యంలో తిండి లేదు

**మొదటిపేజీ తరువాయి**

ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం సుభిక్షంగా ఉండి ఉంటే రెండు రూపాయలకు కిలో బియ్యం ఎందుకు ఇయ్యవలసి వచ్చిందన్నారు. ఇందిర మ్మ రాజ్యం లాంటి దరిద్రమైన రాజ్యం ఇంకోటి లేదన్నారు కేసీఆర్. ఇందిరమ్మ పాలన అంతా రాచిరంపాలు పెట్టడం, దోచుకోవడం తప్ప ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కొల్లాపూర్ చరిత్ర ఏం గొప్పగా లేదన్నారు. పెద్ద కొత్తపల్లి, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లో గుంపు మేస్త్రీలు ఉండేవారని గుర్తుచేశారు. గుంపు మేస్త్రీల వెంట బొంబాయి వలసలు ఉండేవన్నారు. గంజి కేంద్రాలు పెట్టిన చరిత్రను మరిచిపోలే మన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణకు వెనుకబడ్డ ప్రాంతంగా పేరు తెచ్చారన్నారు కేసీఆర్. పదేళ్ల కింద కూడా తెలంగాణకు నీళ్లు రావని, వడ్లు పండవని చెప్పేవారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఏ మొహం పెట్టుకుని ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. పక్కనే కృష్ణా నది ఉన్న మంచి నీళ్లు ఇవ్వలేదన్నారు కేసీఆర్. గతంలో ఐదేళ్లు మంత్రిగా ఉన్న వ్యక్తి కక్ష కట్టడం, కేసులు పెట్టడం తప్ప ఏమైనా చేశాడా అంటూ జూపల్లిని ఉద్దేశించి కామెంట్స్ చేశారు కేసీఆర్. అందుకే ఆయనను ఓడించారని స్పష్టం చేశారు.

# విమర్శలు తేలిక..ఆత్మ పరిశీలన అవసరం

**మొదటిపేజీ తరువాయి**

నన్ను, వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజగో పాల్‌రెడ్డిని ఒప్పించారు. అందుకు కేంద్ర పెద్దలతో హామీ ఇప్పించి చేర్చుకున్నది నిజం కాదా? రాష్ట్రం లోని దుర్మార్గ పాలన పోవాలి.. మేము కొట్లాడి తె చ్చుకున్న తెలంగాణ బాగుంటే చాలు అన్న ఒకే ఒక్క కారణంతో.. సంవత్సరాలుగా పనిచేసిన కాంగ్రెస్‌ను వదిలి భాజపాలోకి వెళ్లాం. మాట నిలబెట్టుకోక.. మమ్మల్ని మోసగించి, భారాసతో భాజపా అవగాహన పెట్టుకున్నది తెలిసి కదా ఇంతమంది నాయకులు రాజీ నామాలు చేసి బయటకెళ్లింది? విమర్శలు తేలిక.. ఆత్మ పరిశీలన అవసరం' అని విజయశాంతి ట్వీట్ చేశారు.



## కోల్ మైన్స్ పెన్షన్ పెంపుదలకు
# కృషి చేసే పార్టీలకే ఓటు వేయాలి

- సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం సమావేశంలో తీర్మానం

**మంచిర్యాల, విశాల భారతి:** చాలిచాలని కోల్ మైన్స్ పెన్షన్ తో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సింగరేణి విశ్రాంత కార్మికులకు 25% నుండి 50% పెన్షన్ పెంపుదలకు కృషి చేసే ఓట్ల కోసం వచ్చే రాజకీయ పార్టీలకే ఓట్లు వేయాలని ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో జరిగిన సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం సమావేశంలో తీర్మానం చేయడం జరిగినది. సింగరేణి అధికారులకు ఇస్తున్న మాదిరిగానే విశ్రాంత కార్మికులకు కూడా పెరిగిన గ్రాజుటి 20 లక్షలు చెల్లించాలని.. హెల్త్ కార్డు పైన 25 లక్షల వరకు వైద్యం అందించాలని డిమాండ్ చేసారు. 2018 లో శ్రీరాంపూర్ ఎన్నికల సభలో ముఖ్యమంత్రి చేసిన వాగ్దానం మేరకు సొంత ఇల్లు లేని విశ్రాంత కార్మికులకు 200 గజాల స్థలం ఇవ్వాలని.. మారు పేర్లు సారి చేయాలనీ విశ్రాంత కార్మికులకు కూడా ప్రభుత్వం ఆసరా పెన్షన్స్ ఇవ్వా లని అన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకుడు బోడ రాజమౌళి, రాల్ల బండి రాజన్న, బి.లక్ష్మినారాయణ గౌడ్, పూదరి నర్సయ్య, ఏ. బాల మల్లయ్య , కాటాం లక్ష్మణ్, గుండ సుధాకర్,శ్రీ రామోజు రమేష్ , పాత విగ్నేష్ , గుమస శంకర్, కలగూర బానయ్య,పి శంకర్ రావు ,మైదం సాయన్న ,కె.సత్యనారాయణ,కె.నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



# యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

**చిగురుమామిడి, విశాల భారతి:** యాదవులు రాజకీయ, ఆర్థిక, సామాజిక సేవ రంగాల్లో రాణిం చాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు ముక్కెర సదానందం యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీం నగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో కుర్మ, యాదవ సంఘం మండల స్థాయి సమావేశాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా సదానందం యాదవ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ కలిగిన యాదవులు సత్తా చాటాలని సదానందం పిలుపునిచ్చారు. ఒకే కులం ఒకే నినాదంతో ముందుకు వెళ్లాలని కుల సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో చిగురుమామిడి మండల అధ్యక్షులు ముక్కెర సదానందం యాదవ్, చిగురుమామి ఉపాధ్యక్షులు పోతరవేని నరసయ్య, చందాబోయిన కుమార్ స్వామి, చందబోయిన సంపత్, రవీందర్, మర్రి రాజు, ఆసరి శ్రీనివాస్,పోతర మహేందర్, మురిపాల తిరుపతి,పెద్ది వీరయ్య, అని ల్,అమరాజు మల్లయ్య, చెందబోయిన ఐలయ్య,చీకుట్ల కొమరయ్య,చెన్నవేని అనిల్, గుంటి అయిలయ్య,కత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# తుంగతుర్తి కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్

## ఉద్యమ నేతగా సామేల్ కు ఆదరణ

- లోకల్ ,నాన్ లోకల్ నినాదంతో సామెల్ వైపే ఓటర్లు
- పార్టీలకతితంగా సామేల్ కు మద్దతు
- కాంగ్రెస్ లోకి భారీగా చేరికలు
- ఏకతాటి పైకి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

**విశాలభారతి స్టేట్ బ్యూరో:**

తుంగతుర్తి కాంగ్రెస్ కార్యకర్తలు ఫుల్ జోష్ మీద ఉన్నారనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతుంది. తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తెలంగాణ ఉద్యమకారుడు స్థానికుడైన మందుల సామెలను ప్రకటించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ వైపు ఓటర్లు పార్టీలకతీతంగా మద్దతు తెలిపేందుకు స్థానిక అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడమే వాటికి బలం చేకూరిందనే చర్చ కొనసాగింది.అభ్యర్థి ప్రకటన చివరి వరకు ఎవరో తెలియకనిరుత్సాహంలో డైలామాలలో ఉన్న కాంగ్రెస్ శ్రేణులు ఎవరూ ఊహించని విధంగా కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థిని దింపడంతో ఒక్కసారిగా కాంగ్రెస్ కార్యకర్తలకు బలం చేరుకుంది. మందుల సామెల్ గెలుపు ఖాయమనే జోష్ బీఆర్ ఎస్ కాంగ్రెస్ కార్యకర్తల్లో మొదలైంది.

నియోజకవర్గంలో గ్రూప్ రాజకీయాలతో సతమతమవుతున్న కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థిగా రోజుకో పేరు తెరపైకి రావడంతో ఆ అభ్యర్థి వస్తే పని చేయమని ఓ వర్గం, ఈ అభ్యర్థి వస్తే తాము పని చేయమని మరో వర్గం బహిరంగంగానే తమ అసహానాన్ని బయటపెడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరిన ఉద్యమనేత, స్థానికుడు, మాదిగ సామాజికవర్గంకు చెందిన మందుల సామేల్ ను అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా గ్రూపులను పక్కనపెట్టి అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉన్నారు.

అభ్యర్థి సామేల్ నామినేషన్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు గ్రూపులన్నింటిని పక్కనపెట్టి స్వచ్ఛందంగా భారీగా తరలివచ్చి ఐక్యతను చాటడంతో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలులో ఓ టెన్షన్ మొదలైనందన్న చర్చ లేకపోలేదు.

**గ్రామస్థాయిలో కాంగ్రెస్**

పార్టీ క్యాడర్ బలంగా ఉండడంతో 15 ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కలిసి వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని ఎలాగైనా గెలవాలన్న కసితో స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామాలలో విస్తృతంగా అభ్యర్థి గెలుపునకు పని చేస్తున్నారు. అడ్డగూడూరు మండలం ధర్మారం సామేల్ స్వగ్రామం. నాటి టిఆర్ఎస్ ఆవిర్భావం, తెలంగాణ ఉద్యమం మొదలు నుంచి సామేల్ పార్టీలో, ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. తుంగతుర్తిలో సామేల్ అంటే టీఆర్ఎస్, టీఆర్ఎస్ అంటే సామేల్ అన్నట్టుగా నాటి నుండి నేటి వరకు ఉంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన ఎన్నికల్లో తుంగతుర్తి టికెట్ ఆశించిన సామేల్ ను కాదని కేసీఆర్ నల్లగొండకు చెందిన గాదరి కిశోర్ కుమార్ కే రెండు పర్యాయాలు టికెట్ ఇచ్చారు. మూడోసారి కూడా ఆయన్నే అభ్యర్థిగా ప్రకటించడంతో మనస్థాపం చెందిన ఆయన పార్టీని వదిలి బయటకు వచ్చారు. కేసీఆర్ ఆయనకు రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ పదవి ఇచ్చినా నియోజకవర్గంలో ఎమ్మెల్యే కిశోర్ కుమార్ రాజకీయంగా సామేల్ ఎదగకుండా అణిచివేశారన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. కాంగ్రెస్ లో చేరిన సామేల్ కు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ ఆమోదంతో టికెట్ ఇవ్వడంతో నియోజకవర్గంలో ఒక్కసారిగా పొలిటికల్ సీన్ మారింది. లోకల్, నాన్ లోకల్, మాల, మాదిగ సామాజికవర్గాల ఫీలింగ్ ప్రజల్లో బలంగా విస్తరించింది. సామేల్ స్థానికుడు, కిశోర్ కుమార్ స్థానికేతరుడు అన్న ప్రచారాన్ని కాంగ్రెస్ ముమ్మరం చేసింది.

గతంలో తిరుమలగిరిలో ఎమ్మార్పీఎస్ నా కొడుకులకు దళిత బంధు ఇచ్చామని పరుష పదజాలంతో తిట్టడంతో మాదిగలంతా ఎమ్మెల్యే పై గురుగా ఉన్నారు.

నియోజకవర్గంలో మాదిగ సామాజికవర్గం ఓటర్లు సుమారు 50 వేల మందికి పైగా ఉండగా, మాల సామాజికవర్గం ఓటర్లు సుమారు 15 వేల వరకు ఉన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పర్యాయాలు మాల సామాజికవర్గం నాయకులకే టికెట్లు ఇచ్చాయి. ఎస్సీ రిజర్వ్ డ్ అవకాశం ముగుస్తుండటంతో ఈసారైనా మాదిగ సామాజికవర్గం, స్థానికుడైన నాయకునికి టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ వినిపించగా బీఆర్ఎస్ మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యే కిశోర్ కుమార్ కే టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ లోకల్ కార్డు ప్రయోగించి స్థానికుడు, మాదిగ సామాజికవర్గంకు చెందిన మందుల సామేల్ ను అభ్యర్థిగా ప్రకటించి మొదటి అడుగులోనే సక్సెస్ సాధించింది.

పార్టీలకతీతంగా సామేల్ కు మద్దతు కూడా బాగా పెరుగుతోంది. ఉద్యమ నాయకునిగా బీఆర్ఎస్ లో అన్యాయం జరిగిందన్న భావన, స్థానికునిగా అందరితో తత్సంబంధాలు ఉండటం, సీపీఐ పొత్తుతో మెజార్టీ ప్రజలనుంచి ఆయనకు మద్దతు లభిస్తుంది.



**బీఆర్ఎస్ కేడర్**

బీఆర్ఎస్ క్యాడర్ కూడా ఊహించని విధంగా ఉద్యమ నాయకునిగా ఆ పార్టీలో గౌరవం లేదని బయటకు వెళ్లిన సామేల్ కు కాంగ్రెస్ టికెట్ ఇవ్వడంతో ఆ పార్టీ క్యాడర్ కూడా డైలమాలో పడినట్లు స్థానిక ప్రజలు చర్చిస్తున్నారు. సామేల్ తో అనుబంధం ఉన్న బీఆర్ఎస్ లోని నాయకులు, తమను ఎవరూ పట్టించుకోవడం లేదని అసంతృప్తితో ఉన్న నాయకులు, కార్యకర్తలంతా పార్టీని వీడి కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు.

దళితబంధు, బీసీ బంధు తీసుకున్న నాయకులు, కార్యకర్తలు సైతం కాంగ్రెస్ లో చేరుతుండటంతో ఆ పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. మాజీ మంత్రి దామోదర్ రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ బీఆర్ఎస్ లోని ముఖ్య నాయకులకు టచ్ లోకి వెళ్లడంతో వారు సైతం డైలమాలో పడినట్టు సమాచారం. స్థానికేతరుడు, మాల సామాజికవర్గంకు చెందిన నాయకునికి రెండు సార్లు అవకాశం ఇచ్చామని, స్థానికుడు, మాదిగ సామాజికవర్గంకు చెందిన ఉద్యమ నాయకునికి 30 ఏండ్ల తర్వాత అవకాశం వచ్చిందని, పార్టీలో గౌరవం లేక బయటకు వెళ్లిన వ్యక్తికే అవకాశం వచ్చిందని, స్థానికుడైన సామేల్ కు ఎందుకు ఓటు వేయవద్దో చెప్పాలని ప్రచారానికి వెళుతున్న బీఆర్ఎస్ నాయకులకు ప్రజల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కిశోర్ కుమార్, ఇతర నాయకులు కూడా సామేల్ ను విమర్శించే సాహసం చేయడం లేదు. బీఆర్ఎస్ క్యాడర్ లో నిరుత్సాహం ఆవహించి ప్రచారం మందగించగా, కాంగ్రెస్ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ప్రచారాన్ని ముమ్మరం చేశారు.






## ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి

**ఆర్మూర్, విశాల భారతి:** బిఆర్ఎస్ పార్టీ ఆర్మూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్ రెడ్డి సతీమణి రజిత రెడ్డి ఆదివారం సాయంత్రం మాయాపూర్, ఉమ్మెడ, బాద్గుణ, కోమటిపల్లి, నికాల్పూర్, గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి జీవన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ మహిళలు యువకులు ప్రచారం నిర్వహించడంతో ఆయా గ్రామాలలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమాలలో మాయపూర్ గ్రామ సర్పంచ్ మెరుగు అనురాధ సుభాష్ గౌడ్ , ఎంపీటీసీ మక్కూర్ మనోజ్ రావ్, ఉప సర్పంచ్ బ్యాగారి జీవన్, గ్రామ శాఖ అధ్యక్షులు దేశింఢ్ల సాగర్, సీనియర్ నాయకులు రొడ్డ రవి, రోడ్డ మురళి, మట్ట సంతోష్, మేకల వినోద్, బొగ్గుట సాయన్న ప్రేమ్ కుమార్, కుమార్ , వంశీ, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు. ఇక ఈ ఎన్నికల ప్రచారానికి వచ్చిన రజిత రెడ్డిని మాయాపూర్ గ్రామ సర్పంచ్ మెరుగు అనురాధ సుభాష్ గౌడ్ సన్మానించి చిరు కానుకగా నూతన వస్త్రాలను అందించారు .




## ధనస్వామ్యాన్ని బద్దలు కొట్టండి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టండి

**ఆమనగల్లు, విశాల భారతి :** ధనస్వామ్యాన్ని బద్దలు కొట్టండి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టలని..ఓటు అమ్ముకుంటే బ్రతికున్నా శవంతో సమానమని, నోటుకి ఓటు అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్తు అధోగతే అని జైహో ఆమనగల్లు మండల అధ్యక్షులు జహంగీర్ పాషా అన్నారు. ఆదివారం జై భారత్ జాతీయ సమితి సభ్యులు ఖదిజ్ఞాసి రాజు ఆధ్వర్యంలో డబ్బుకి ఓటు అమ్ముకుంటే బ్రతికున్నా శవంతో సమానం పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి జైభారత్ ఉద్యమం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. అణగారిన వర్గాల ప్రజలను చైతన్యం చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా జస్ట్ ఓట్ క్యాంపెయిన్ చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఎన్నికల్లో రాజకీయ నాయకుల ధన ప్రలోభాన్ని, ఓట్ల కొనుగోలును ఎండగడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణపట్ల ఓటర్ల బాధ్యతను చాటిచెపుతూ జైభారత్ 'జస్ట్ ఓట్ క్యాంపెయిన్'ను తెలంగాణ వ్యాప్తంగా ఉధృతంగా చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్ , ఇస్మాయిల్ , రాజు, మహమ్మద్ పాషా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పార్టీ యువ నేతల భారీ బైక్ ర్యాలీ

**మందమర్రి టౌన్, విశాల భారతి:** బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా మందమర్రి పట్టణంలోని 4వ వార్డులో ప్రాణహితకాలని శిర్కే ప్రాంత యువ నాయకుల అధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అప్పుడెట్లుండె తెలంగాణ, ఇప్పుడెట్లయ్యింది తెలంగాణ అంటూ శిర్కే యువత ఆదివారం వాడ వాడల్లో తిరుగుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో చెల్లని రసిదుతో సమానమని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, మేనిఫెస్టోపై అవగాహన కల్పిస్తూ, సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా, సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి బాల్క సుమన్ ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల శ్రీనివాస్, బెజ్జాల సది, కిరణ్ కుమార్, రవి, సంతు, ఎం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఝాన్సీరాణి లక్ష్మి బాయి జయంతి వేడుకలు

**మందమర్రి టౌన్, విశాల భారతి:** బ్రిటిష్ కు వ్యతిరేకంగా సాహసోపేత తిరుగుబాటు చేసి పోరాడిన పోరాట యోధురాలు ఝాన్సీరాణి లక్ష్మీబాయి జయంతి వేడుకలను మాజీ సైనికుడు రాజేష్ పీహ్వాల్, రాణి పిహ్వాల్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ పిహ్వాల్ మాట్లాడుతూ రాణి లక్ష్మీబాయి 1828 నవంబర్ 19 న వారణాసి నగరంలో జన్మించారని, 1857 నాటి భారత తిరుగుబాటులో పాల్గొన్న ప్రముఖ నాయకులలో ఝాన్సీరాణి లక్ష్మీబాయి ఒకరని తెలిపారు. ఝాన్సీరాణి లక్ష్మీ బాయి బ్రిటిషర్లతో చాలా ధైర్యంగా పోరాడిన వీర వనిత అని ఆమె ధైర్య సాహసాలను కొనియాడారు. 1858



జూన్ 18 న బ్రిటిష్ వారిపై తిరుగుబాటు యుద్ధంలో మగవాడి వేషం వేసుకుని భీకర యుద్ధం చేసి ఆమె మరణించారని తెలిపారు.

## విద్యా వంతుడికి అవకాశం ఇవ్వండి

- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి అంజి యాదవ్

**మోతె,విశాలభారతి:** యువకుడిగా ఉన్నత విద్యావంతుడిగా నాకు అవకాశం ఇవ్వాలని పార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లె బోయిన అంజి యాదవ్ అన్నారు ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ యువకుడిగా విద్యావంతునిగా ఓటు విలువ తెలిసిన నన్ను గెలిపించడం ద్వారా కష్టం విలువ తెలిసిన నేను ఎల్ల వేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు మోతె, నామవరం, రాఘవపురం, సిరికొండ, రావి పహాడ్, కూడలి, సర్వారం, గోల్ తండ, బుర్కచర్ల,హుస్సేన బాద్, విభలాపురం, మామిల్లగూడెం,,తుమ్మలపల్లి, కొత్తగూడెం సింహం గుర్తుకు ఓటు వేయాలని గడపగడపకు తిరగి ఓటర్లను అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో , విద్యావంతులు కార్యకర్తలు,నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నేతల ఇంటింటికి ప్రచారం

**ఆర్మూర్,విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం నంది పేట్ మండలంలోని మాయాపూర్ గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ దూడ వెంకటేష్ మాట్లాడుతూ చేతు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలను అమలు చేస్తుందని ఓటర్లకు వివరించారు దూడ రమేష్, బ్యాగరి సంజీవ్, మోర్తాడ్ ముత్యం, భోజేందర్, ఇసాపల్లి ముత్తెన్న,అల్లేపు గంగాధర్ పాల్గొన్నారు.



## 119 నియోజకవర్గాల్లో ఓసీ గురుకులాలు ఏర్పాటు

- విద్యపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి
- కాంగ్రెస్ ఏం జరుగుతుందో తెలియకుండా మేనిఫెస్టో విడుదల
- మంత్రి హరీశ్‌రావు

**విశాలభారతి స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ నాయకులకు ఏం జరుగుతుందో తెలియకుండానే మేనిఫెస్టో విడుదల చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మోకాలిచిప్ప ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని పేర్కొన్నారు.. కానీ, ఇప్పటికే పలు ఆసుపత్రుల్లో ఉచితంగా మోకాలిచిప్ప ఆపరేషన్లు చేస్తున్నామని హరీశ్‌రావు చెప్పారు. విద్యపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని హరీశ్‌రావు చెప్పారు. అన్ని వర్గాలు చదువుకునేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. సిద్దిపేటలో రాష్ట్ర గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తో కలిసి మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేసీఆర్ రెండోసారి సీఎం అయ్యాక విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో 60 ఏళ్లలో 268 గురుకులాలు ఉంటే.. ప్రస్తుతం గురుకులాలు వెయ్యికి పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. గతంలో గురుకులాలలో 1.90లక్షల మంది విద్యార్థులు చదవితే.. భారాస ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 6లక్షలకు పెరిగిందన్నారు. గురుకులాల్లో చదివిన 6,652 మంది విద్యార్థులు నేడు దేశ, విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారని కొనియాడారు. గురుకుల పాఠశాలలను పదో తరగతి నుంచి ఇంటర్ వరకు అప్ గ్రేడ్ చేశామని, మళ్లీ అధికారంలోకి వచ్చాక ఇంటర్ నుంచి డిగ్రీకి అప్‌గ్రేడ్ చేస్తామని ప్రకటించారు. భారాస మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 119 నియోజకవర్గాల్లో ఓసీ గురుకులాలు ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో ప్రకటించారని హరీశ్‌రావు వివరించారు.





## అధికారం శాశ్వతం కాదు.. అనుబంధం శాశ్వతం

- తెలంగాణతో బీఆర్ఎస్‌కు ఉన్నది పేగు బంధం
- ఎమ్మెల్సీ కవిత

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అధికారం శాశ్వతం కాదు.. అనుబంధం శాశ్వతంగా ఉంటుందని.. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఉన్నది పేగు బంధమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న అనంతరం స్థానిక బ్రాహ్మణ్ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన పట్టణ మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి 50 ఏళ్లు అవకాశం ఇస్తే పేద ప్రజలకు కనీస సౌకర్యాలను కల్పించలేక పోయారని ఆమె విమర్శించారు. సంక్షేమ పథకం కింద ఒక్క రూపాయి పించన్ ఇవ్వలేక పోయారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారు. 2014లో తెలంగాణ వచ్చినప్పుడు మన పరిస్థితి ఎట్లా ఉండేది.. ఇప్పుడు ఎలా ఉందో ఒకసారి ఆలోచించుకోవాలి. మళ్లీ బీఆర్ఎస్, కొప్పుల ఈశ్వర్‌ను గెలిపిస్తే పింఛన్‌ను రూ.2000 నుంచి రూ. 5000లకు పెంచుతామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత హామీ ఇచ్చారు.







## బిఆర్ఎస్ నీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిక

**నేరేడుచర్ల విశాల భారతి:** బిఆర్ఎస్ నీ వీడి కాంగ్రెస్ లో చేరిన మాజీ పిఏసిఎస్ చైర్మన్ చలసాని శ్రీనివాస్.సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన చిల్లేపల్లి మాజీ పిఏసిఎస్ చైర్మన్,మాజీ ఎంపీటీసీ చలసాని శ్రీనివాస్ నల్గొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో పార్టీ కండవా కప్పుకున్నారు.ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్ లాంటి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉందని, నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీ ఒకటే అని,ప్రజా సమస్యలు తెలుసుకుని పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను మేనిఫెస్టోలో పెట్టిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొణతం చిన్న వెంకట రెడ్డి,మాజీ మండలాధ్యక్షుడు వల్లంచెట్ల వెంకటేశ్వరరావు,పెంచికల్ దిన్న మాజీ సర్పంచ్ వల్లంశెట్ల కృష్ణయ్య, కొంజేటి జ్యోతి బాబు,కల్లూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుడిగె వెంకటేశ్వర్లు,మధురోషన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తి దొరలకు చరమ గీతం పాడాలి

- కమిషన్ల కోసమే ఇంటిగ్రేటెడ్ మార్కెట్
- కళ్ళ ముందు జరిగే అన్యాయాలను చూడలేక బయటకి వచ్చా
- బిఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్



**సూర్యాపేట విశాలభారతి:** త్వరలో జరుగబోయే ఎన్నికల్లో తుంగతుర్తి దొరలకు చరమ గీతం పాడాలని బిఎస్పీ పార్టీ సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డ, బర్ల పెంట బజారులలో ఆదివారం బిఎస్పి పార్టీ సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పలువురు కార్యకర్తలు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి బిఎస్పి పార్టీలో చేరారు.ఈ సందర్భంగా జానయ్య యాదవ్ మాట్లాడుతూ దొరల పాలన కు విముక్తి కలగాలంటే మనం మారాలని, అందుకు ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. కమిషన్ల కోసమే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించినారని,కళ్ళ ముందు జరిగే అన్యాయాలను చూడలేక బయటకి వచ్చానని తెలిపారు.అభివృద్ధి పేరుతో వేలకోట్ల రూపాయలు దండుకున్న మంత్రి జగదీశ్ రెడ్డి కి సరిపోక నిరుద్యోగుల నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుంచి ఐదు లక్షల రూపాయల చొప్పున వసూలు చేసి మోసం చేశాడని ఆరోపించారు.ప్రజల సొమ్మును దోచుకున్న మంత్రి జగదీశ్ రెడ్డిని ఓటు రూపంలో తరిమి కొట్టాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలంతా ఏకమై బహుజన వాదాన్ని గెలిపించుకోవాలని, అందుకు ఏనుగు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్, అన్నేపర్తి రాజేష్, ధరావత్ నిలాబాయి లింగా నాయక్, మాజీ కౌన్సిలర్ కుంభం రజిత నాగరాజు, మీర్ అక్బర్, మల్సుర్, నజీమా, మేడం వెంకన్న, కలమ్మ, విద్యం సతీష్ నాయుడు, గోనె సతీష్, నరేష్, రజిత, పద్మ, క్రాంతి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## జోరుగా కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

- వీరేశం గెలుపే లక్ష్యమన్న చైర్మన్

**చిట్యాల విశాలభారతి:** చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరందుకుంది. మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 8, 2వ వార్డులలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మున్సిపాలిటీ చైర్మన్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వేముల వీరేశం హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే అందరూ హస్తం గుర్తుపై ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ హామీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని అలాగే బడుగు బలహీన నిరుద్యోగ, వైద్య, విద్య, వ్యవసాయం, ఉపాధి వంటి రంగాలని అభివృద్ధి చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ప్రజలందరూ కూడా కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తూ హస్తం గుర్తుకు ఓటు వేసి నకిరేకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం ని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పోకల దేవదాస్, కౌన్సిలర్ కోనేటి కృష్ణ, నాయకులు ఏర్పుల పరమేష్, జిట్టా చంద్రకాంత్, కుక్కల మోహన్, బొబ్బలి రాంరెడ్డి, జిట్టా బిక్షం చిన్నస్వామి, కొసనం అశోక్, కళ్లెం నరసింహ, దేశపాక రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

- మరింత అభివృద్ధి చేసుకుందాం
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసా

**సూర్యాపేట విశాలభారతి:** ఆరు దశాబ్దాల సూర్యాపేట వెనుకబాటును ఒక్క దశాబ్ద కాలంలోనే రూపుమాపిన ఘనత జగదీష్ రెడ్డి గారిదే అని బీఆర్ఎస్ సూర్యాపేట అభ్యర్థి జగదీష్ రెడ్డి సతీమణి సునిత జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట లో ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టిన సునిత జగదీష్ రెడ్డి 48వ వార్డులో టిఆర్ఎస్ మేనిఫెస్టో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. మరోవైపు 15 వార్డులో మంత్రి కుమారులు వేమన్ రెడ్డి, చంద్రారెడ్డి, సోదరి కట్టా రేణుక శేఖర్ రెడ్డిలు గడపగడపకు తిరుగుతూ బీఆర్ఎస్ చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునితమ్మ మాట్లాడుతూ సూర్యాపేట లో ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్ కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే వారెంటీ లేని హామీలను ప్రజలు నమ్మొద్దన్నారు. 60 కాంగ్రెస్ పరిపాలనలో తాగునీరు, కరెంట్, మౌలి సదుపాయాలను ఎందుకు కల్పించలేకపోయిందో ప్రజలు ఒకసారి ఆలోచించాలన్నారు. 2014 లో జగదీష్ రెడ్డి వచ్చాక సూర్యాపేటలో ఎలా అభివృద్ధి జరిగిందో ప్రజలందరూ గమనించాలన్నారు.ప్రస్తుతం ఆచరణకు సాధ్యం కాని హామీలతో ఓట్లు దండుకోవాలని చూస్తున్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోతో ప్రజలకు భరోసా అని తెలిపారు. గత రెండు మేనిఫెస్టోలను నూటికి నూరు శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ గారిదే అన్నారు. మూడవసారి ఆశీర్వదిస్తే మేనిఫెస్టోలో చెప్పిన అన్ని సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. 400కే గ్యాస్ సిలిండర్, మిషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా మహిళలకు 3000, రైతు బీమా తరాలు ప్రతి పేదవారికి ఐదు లక్షల కేసీఆర్ బీమా, ఇల్లు లేని ప్రతి పేదవారికి పక్కా ఇల్లు నిర్మాణం, ఆసరా పెన్షన్లు 5000 పెంపు, దివ్యాంగులకు 6000, రైతుబంధు 16 వేలు అంటే ఈ పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్న సునీతమ్మ కారు గుర్తుకు ఓటు వేసి మూడవసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

## సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

- గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి పిలుపు..



**జఫర్ గడ్ విశాల భారతి :** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ చాగల్లులో సోమవారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు, స్టేషన్ ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇంచార్జి అన్నం బ్రహ్మ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా వారు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని మండల పార్టీ ముఖ్య నాయకులకు ప్రజా ప్రతినిధులకు నాయకులకు కార్యకర్తలకు యువజన నాయకులకు మహిళలకు అభిమానులకు వివిధ గ్రామాల ప్రజలకు పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ సహకారంతో చేసిన అభివృద్ధి ప్రజల కళ్ల ముందే ఉందన్నారు.సీఎం కేసీఆర్ ను మూడో సారి ముఖ్య మంత్రిగా గెలిపించటానికి ప్రజలు ఉత్సాహంతో ఉన్నారన్నారు.తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపిన కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా చరిత్ర సృష్టించబోతున్నారని పేర్కొన్నారు.మండలం నుండి భారీ సంఖ్యలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మందుల సామెలు గెలుపొందాలని ఊట్కూరులో ప్రత్యేక పూజలు

**శాలిగౌరారం విశాలభారతి:** తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మందుల సామెలు భారీ మెజార్టీతో విజయం సాధించాలని కోరుకొంటూ ఊట్కూరు గ్రామంలో ని శ్రీ శివాంజనేయ దేవాలయంలో ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ అన్నెబోయిన సుధాకర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 30 వేల మెజార్టీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో నాయకులు, కార్యకర్తలు బాగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించేలా కృషి చేయాలనీ కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ లను, మ్యానిప్యాస్టోలోని వివిధ వర్గాలకు చెందిన పథకాలు ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కుర్ర లింగయ్య, ఉపసర్పంచ్ కప్పల శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,శీలం శంకర్,రంగు బిక్షం, రంగు లింగయ్య, వేముల గోపినాథ్, పగిడి రామలింగయ్య, వరికుప్పల వెంకన్న,రావుల సత్తయ్య,రామసాని రాములు,బొడ్డు సోమయ్య, వేముల సోమయ్య, నిదురా వీరయ్య, వేముల సాయి, బొమ్మగాని అంజయ్య, కప్పల సైదులు రంగు సైదులు, దేనబోయిన నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



## బీసీల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ

- కాంగ్రెస్ పార్టీకే బీసీ సంక్షేమ సంఘం మద్దతు

**కోదాడ విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఉత్తమ్ పద్మావతి రెడ్డికి ఆర్ కృష్ణయ్య బీసీ సంక్షేమ సంఘం తరపున తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆ సంఘం డివిజన్ అధ్యక్షులు శివ, పట్టణ అధ్యక్షులు మైలారిశెట్టి సైదయ్యలు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ ఆడిటోరియంలో కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావుని కలిసి తమ మద్దతు తెలిపారు. కోదాడలో ఎన్నికల సమయంలో బీసీ అని చెప్పుకునే ఎమ్మెల్యే కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే బీసీలు గుర్తుకు వస్తారని మిగతా సమయంలో బీసీల పట్ల చిన్నచూపు చూస్తారని తెలిపారు. బీసీ బంధు పథకంలో బీసీ కులాల వారికి తీరని అన్యాయం జరిగిందని అన్నారు. వారి జెండాలు మోసే ప్రధాన నాయకులకు మాత్రమే బీసీ బంధు వర్తింప చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసలైన అర్హులకు బీసీ బంధు రాలేదని దాని మూలంగా పేద బడుగు బలహీన వర్గాలు అన్యానికి గురవుతున్నారని ఇలాంటి బీసీ కులం పేరు చెప్పుకొని ఓట్లు దండుకొనే ఎమ్మెల్యేను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బీసీలందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉత్తమ్ పద్మావతి రెడ్డికి అత్యధిక ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామినేని శ్రీనివాసరావు, అల్తాఫ్ హుస్సేన్, బడేటి వెంకటేశ్వర్లు, గుండు శ్రీనివాస్, నాగలక్ష్మి, మల్లేష్ యాదవ్, మేకపోతుల సత్యనారాయణ, గుండు విజయ రామారావు, కాసాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## కామ్రేడ్ మోకాళ్ళ కృష్ణను గెలిపించండి

- జిల్లా నాయకులు జడ సత్యనారాయణ

**మహబూబాబాద్ విశాల భారతి:** న్యూడెమోక్రసీ ఇల్లందు నియోజకవర్గ అభ్యర్థి మోకాళ్ళ కృష్ణుని గెలిపించాలంటూ నవంబర్ 22న ఇల్లందు పట్టణంలో జరుగు ఎన్నికల బహిరంగ సభను జయప్రదం చేయాలంటూ ఈరోజు గార్ల స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో గోడపత్రికల ఆవిష్కరణ జరిగింది గోడపత్రికల ఆవిష్కరణ అనంతరం న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు జడ సత్యనారాయణ ప్రసంగిస్తూ న్యూడెమోక్రసీ ఇల్లందు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి మోకాళ్ళ కృష్ణ కుండ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఇదే క్రమంలో మోకాళ్ళ కృష్ణ గెలుపును ఆకాంక్షిస్తూ ఇల్లందులో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ గార్ల మండల ఎన్నికల కన్వీనర్ జీ సక్రు కో కన్వీనర్ గౌని భద్రయ్య మండల నాయకులు సిహెచ్ గణేష్ సూత్రపు మనోహర్ ఖాజా మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.



## స్వామి స్మరణ శుభదాయకం

- సన్మార్గానికి అయ్యప్ప మాల ధారణ దోహదం
- సూర్యాపేటలోని విద్యానగర్ లో శ్రీ ధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం
- ముఖ్య అతిధి గా హాజరై దీక్షా స్వాములకు అన్నదానం చేసిన మంత్రి జగదీష్ రెడ్డి

**సూర్యాపేట విశాలభారతి:** అయ్యప్ప దీక్ష వల్ల ఏకాగ్రత, క్రమశిక్షణ, ప్రశాంతత, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది అని రాష్ట్ర మంత్రి సూర్యాపేట బిఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని విద్యానగర్ లో శ్రీ ధర్మ శాస్త అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన మంత్రి శాస్త్రోక్తంగా అన్నదానం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ,సన్మార్గంలో నడవడానికి అయ్యప్ప స్వామి మాలధారణ దోహదపడుతుందని అన్నారు. కుల మతాలకతీతంగా అందరూ ఒక్కటేననీ.. ప్రతి దీక్షాపరునిలో అయ్యప్పస్వామి కొలువై ఉన్నాడనీ.. దీక్షాకాలంలోనే కాకుండా ఆ సుగుణాలను జీవితాంతం పాటించాలనీ మండల దీక్ష చెబుతోంది అన్నారు.భక్తి పారవశ్యంతో, అకుంఠిత దీక్షతో స్వాములు 41 రోజులు దీక్ష చేయడం అభినందనీయమన్నారు. చన్నీటి స్నానంతో రోగాలు దూరమవుతాయని, చెప్పులు లేకుండా నడవడంతో రక్తప్రసరణ మెరుగవుతుందన్నారు. ఏకభుక్తంతో శరీరాకృతిమారుతుందన్నారు.అయ్యప్పస్వామి ఆశీస్సులు ప్రతీ ఒక్కరి పై ఉండాలని ఆకాంక్షించారు.



## ఘనంగా కమ్మ సంఘం కార్తీక వనభోజన మహోత్సవం

**నేరేడుచర్ల విశాల భారతి:** ఘనంగా కమ్మ సంఘం కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు న్యాయవాది సుంకరక్రాంతి కుమార్ తెలిపారు.ఆదివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేరేడుచర్ల,గరిడేపల్లి,పాలకీడు మండలాలలోని కమ్మ కులస్తులు కార్తీకమాస వన మహోత్సవాలు ఘనంగా నిర్వహించామన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ కులస్తులందరూ ఏకతాటిపై కార్తీక మాసం వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని వందలాదిగా వచ్చి విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఇలా కులస్థులు అందరు కలిసి ఇంత పెద్ద కార్యక్రమాన్ని విజయవంతం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇలాగే ప్రతి సంవత్సరం పార్టీలకతీతంగా కార్యక్రమాన్ని ఎంతో గొప్పగా నిర్వహించుకుందామని తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు రావులపల్లి ప్రసాద్,చలసాని శ్రీనివాసరావు,రాజీవ్,చావ వీరభద్రరావు,డాక్టర్ బెనర్జీ,జ్యోతి బాబు,డాక్టర్ భరద్వాజ్,వల్లం చెట్ల వెంకటరావు,న్యాయవాది సుంకర ప్రదీప్తి,నిమ్మగడ్డ అన్నపూర్ణ, సులోచన,రమణమ్మ, నాగవేణి, వాణి,శ్రీరామ్ మూర్తి,నాగండ్ల శ్రీధర్,వెంకటేశ్వరరావు, సుబ్బారావు నిమ్మగడ్డ,చెరుకుమల్లి కిషోర్,రవి చెరుకూరి,యారవ సురేష్,పాతూరు శ్రీనివాస్,అల్లు నాగభూషణం,శేఖర్ పోలవరపు చిట్టిబాబు,మోహన్, వల్లచెట్ల లచ్చయ్య,మాధవ రావు, శ్రీను,నారాయణ,మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఉపన్యాస పోటీలో నడిగూడెం విద్యార్థినికి ప్రథమ స్థానం



**నడిగూడెం విశాలభారతి:** మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర అనే అంశం మీద జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో నడిగూడెం మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని షేక్ నజ్మీన్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయిలో రెండవ బహుమతి గెలుపొందారు. మేమెంటో తోపాటు 9000 వేల రూపాయల నగదు అందజేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు పొంది మండలానికి పేరు తెచ్చిన విద్యార్థినిని, పాఠశాల ఉపాధ్యాయులను మండలవిద్యాశాఖాధికారి సలీం షరీఫ్ అభినందించారు.



## కోరం కనకయ్య గెలుపుకై ప్రజలు కష్టపడి భారీ మెజార్టీతో గెలిపించాలి

**మహబూబాబాద్ విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోతు సుధాకర్ నాయక్ భూక్య రవి నాయక్ మాట్లాడుతూ కోరం కనకయ్య గారి గెలుపు కోసం అందరూ కష్టపడి భారీ మెజార్టీతో గెలిపించాలని, కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడపాలని చూస్తున్నారు. గిరిజన జాతికి పెద్ద పీట వేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అందరికీ సామాజిక న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ రావాలి కోరం కనకయ్య గారి చేతి గుర్తుకే మన ఓటు జై కాంగ్రెస్ జై జై కాంగ్రెస్ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శివాజీ నాయక్ ఎర్రుపోతుల మధుకర్ రాజు అభిరాం నాయక్ విక్రమ్ నాయక్ మంగీలాల్ నాయక్ సురేష్ నాయక్ మోహన్ నాయక్ నెహ్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# 24 గంటలు ఫ్రీ కరెంట్ బీఆర్ఎస్ తోనే సాధ్యం

- బీఆర్ ఎస్ అభ్యర్థి భాస్కర్ రావు

**మిర్యాలగూడ విశాల భారతి:** రైతాంగానికి 24 గంటల ఫ్రీ కరెంట్ , గృహ, పరిశ్రమల నిర్వహణకు నిరంతర విద్యుత్ సరఫరా బీఆర్ ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని మిర్యాలగూడ బీఆర్ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కరరావు అన్నారు. ఆదివారం మాడుగుల పల్లి మండలం పాముల పహాడ్, పోరెడ్డి గూడెం, గుర్రప్పగూడెం, బొమ్మకల్, ఆగా మోత్కూర్, చిరుమర్తి గ్రామాల్లో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు అలుగుబెల్లి అమరేందర్ రెడ్డి తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వం లో మిర్యాలగూడ నియోజకవర్గం గణనీయ అభివృద్ధి సాధించిందన్నారు. మాడుగుల పల్లి మండలంలో చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా అన్ని పల్లెలో సీసీ రోడ్లు, ప్రధాన గ్రామాలకు బీటీ రోడ్లను వేసినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలో తెచ్చేందుకు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. అదే విధంగా వేములపల్లి మండలం పరిధిలోని రావు వారిగూడెం, ఎన్ ఎస్పీ క్యాంప్ నుంచి వివిధ పార్టీల వారు బీఆర్ ఎస్ లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, కోటిరెడ్డి, అఫ్జల్, కనకా రెడ్డి, సైదులు తదితరులున్నారు.కేటీఆర్ రోడ్ షోను సక్సెస్ చేయాలి...! నేడు మిర్యాలగూడ పట్టణంలోని మధ్యాహ్నం 1 గంటకు హనుమాన్ పేట నుంచి రాజీవ్ చౌక్ వద్దకు వరకు జరిగే పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్డు షో ను పార్టీ శ్రేణులు సక్సెస్ చేయాలని అభ్యర్థి భాస్కరరావు కోరారు. నియోజకవర్గం గురించి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

# సీఎం సభలతో బిఆర్ఎస్ పై ప్రజలకు విశ్వాసం పెరిగింది నమ్మకం కుదిరింది

- బిఆర్ఎస్ కు ఆదరణ పెరుగుతున్న కొద్దీ కాంగ్రెస్ నాయకులలో ఫ్రస్టేషన్
- ఉమ్మడి జిల్లాలో 12 కు 12 స్థానాల్లో గులాబీ జెండా ఎగరవేస్తాం
- సీఎం సభలో సూర్యాపేటకు మరిన్ని వరాలు
- సీఎం రాక కోసం సూర్యాపేట ప్రజలు ఎదురుచూస్తున్నారు
- ఈనెల 21న మధ్యాహ్నం 3 గంటలకు సూర్యాపేటలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ
- సభాస్థలిని పరిశీలించిన మంత్రి జగదీష్ రెడ్డి



**సూర్యాపేట విశాలభారతి:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీఎం కేసీఆర్ సభలతో బిఆర్ఎస్ పై ప్రజలకు విశ్వాసం పెరిగింది.. నమ్మకం కుదిరిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట బిఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 21న సూర్యాపేటలోని ఈనాడు కార్యాలయం ఎదురుగా, నూతన వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా తలపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ స్థలి ని మంత్రి జగదీష్ రెడ్డి పరిశీలించారు. సీఎం రాకతో ఆయన మాటలను వినడానికి స్వచ్ఛందంగా తరలిరానున్న వేలాదిమంది ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాలని నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం రాక కోసం సూర్యాపేట ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ బిజెపిలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలపడమే కాకుండా, సూర్యాపేట అభివృద్ధి కోసం ఏం చేస్తామనే విషయాన్ని, బిఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు సీఎం కేసీఆర్ వివరిస్తారని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో సీఎం పాల్గొన్న తొమ్మిది బహిరంగ సభలతో బిఆర్ఎస్ కు ఆదరణ పెరిగిందన్న మంత్రి మాకు పెరుగుతున్న ఆదరణ చూసి కాంగ్రెస్ నాయకుల ముఖాలలో ఫ్రస్ట్రేషన్ కనబడుతుంది అన్నారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12 కు 12 స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు.తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీతో మాట్లాడించే ప్రతి అక్షరం అబద్ధం అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పసలేదన్న మంత్రి, అది ప్రజలకు పనికి వచ్చేది కాదన్నారు. అబద్ధాలు, మోసాలతో ఎలాగైనా అధికారంలోకి రావాలనేదే కాంగ్రెస్ లక్ష్యం అన్నట్లుగా మ్యానిఫెస్టో ఉందన్నారు. బడ్జెట్ మొత్తం ఒకే పథకానికి సరిపోయే పద్ధతిలో వారి మేనిఫెస్టో ఉందని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ మ్యాని ఫెస్టో ను ప్రజలు ఆదరిస్తున్నారన్న మంత్రి కెసిఆర్ పై ప్రజలకు ఉన్న నమ్మకానికి మా మేనిఫెస్టో నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ కు ఓటేస్తే కర్ణాటక పరిస్థితులే ఇక్కడ పునరావృతం అవుతాయన్న విషయాన్ని ప్రజలు గ్రహించారని అన్నారు. తెలంగాణ తరహా మేనిఫెస్టో తోనే కర్ణాటకలో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. తమను మోసం చేసిన కర్ణాటక ప్రభుత్వ ఆకృత్యాలను ఇక్కడి ప్రజలకు వివరించడానికి సభ ఏర్పాటు చేసుకోవడానికి సిద్ధమైన కర్ణాటక రైతులు అభినందనీయులని అన్నారు. వారి సభకు ఎలక్షన్ కమిషన్ అనుమతిస్తుందని మంత్రి జగదీష్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



# ముస్లిం మైనారిటీలు అందరూ కాంగ్రెస్ కే మద్దతు

- బర్రె జహంగీర్, మాజీ మున్సిపల్ చైర్మన్

**భువనగిరి విశాల భారతి:** భువనగిరి లోని గాస్పెల్ చర్చ్ వద్ద క్రీస్తవుల ప్రార్థన అనంతరం చర్చ్ బయట కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉండాలని బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ చెప్పారు. క్రీస్తవ బంధు వర్గం మొత్తం కూడా మొదటి నుండి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తూ వచ్చారాని,మతాలకు, కులాలకు అతీతంగా ఉన్నారని,మైనార్టీల రిజర్వేషన్లు కూడా కాంగ్రెస్ మాత్రమే అమలు పరిచిందని తెలిపారు. ఎల్లవేళల క్రిస్టియన్ మైనార్టీలు ఎంతో కాలం నుంచి ఎదురుకొంటున్న స్మశానవాటికల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, కాంగ్రెస్ప్రభుత్వం అధికారంలో రాగానే సమస్యల పరిష్కరం కోసం ముందుండి ప్రయత్నం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో అన్ని వర్గాలకు చెందిన వారికోసం సంక్షేమ పథకాలు రూపొందించిన్నారు. అందరూ కలిసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావడానికి కృషి చేయాలని కోరారు. 3040 ఏండ్ల క్రితం దళితులకుఇందిర కాంగ్రెస్ ఇచ్చిన అసైన్డ్ భూములను కేసీఆర్ లాక్కొని ఆనాధాలను చేసాడని,దళిత ముఖ్యమంత్రి ని చేస్తానని మోసం చేసి,దళిత బంధు అని చెప్పి కేవలం BRS కార్యకర్తలకే మంజూరు చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలని మైనార్టీ రిజర్వేషన్లు ఇంత వరకు కూడా kcr ప్రభుత్వం అమల్లోకి తేలేదని, దళితులకు దళిత బంధు ఆశ చూపి మోసం చేస్తున్నారని, డబల్ బెడ్ రూమ్ ల ఊసే లేదని అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిచ్చారని ఆరోపించారు, ప్రజలు ఆలోచించి మోసం మాటలు నమ్మొద్దని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావడానికి అందరూ కలిసి చెయ్యి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్ధించారు ఈ కార్యక్రమంలో బట్టు ప్రేమ్,నిశాంగి కళ్యాణ్,గోగు సాయి యాదవ్ పాల్గొన్నారు.



# ఎర్రజెండా నిరుపేదలకు అండ

- చిట్యాల లో సిపిఎం ఎన్నికల ప్రచారం

**చిట్యాల విశాలభారతి:** నిరుపేదలకు అండదండగా ఉండేది ఎర్రజెండానే అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్,అవిశెట్టి శంకరయ్యలు అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో సిపిఎం నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టజీవుల హక్కుల కోసం పనిచేసే కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం అభ్యర్థి బొజ్జ చిన్న వెంకులును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థి బొజ్జ చిన్న వెంకులు మాట్లాడుతూ తనను గెలిపిస్తే అసెంబ్లీలో ప్రజల గొంతు గా నిలుస్తానని అన్నారు.కళాకారుల డప్పు వాయిద్యాలతో మహిళలు, యువత పెద్ద ఎత్తున ప్రచారం కొనసాగించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, రూరల్ మండల కార్యదర్శి అరూరి శ్రీను, మండల నాయకులు శీలా రాజయ్య, ఐతరాజు నర్సింహా, గుడిసె లక్ష్మినారాయణ, మెట్టు నర్సింహా, మెట్టు పరమేష్, రాచకొండ శ్యాం సుందర్, మేడి సుగుణమ్మ,మాదరబోయిన వెంకన్న,నెలికంటి నర్సింహా, బూరుగు గోపి,లోడె విష్ణుమూర్తి యం డి జహంగీర్, జిట్ట రమాదేవి,పాల బాలనర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం ఫ్యాట్‌లకు 2వ విడత రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక.



**మహబూబాబాద్ విశాల భారతి:** రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 101డోర్నకల్ నియోజకవర్గం, 102 మహబూబాబాద్ నియోజకవర్గాలలో జరుగునున్న ఎన్నికల సందర్భంగా ఈ.వి.ఎం.లు, వి.వి. ఫ్యాట్ లకు 2వ విడత రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఆదివారం ఐ డి.ఓ.సి లోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఇరా సింఘాల్, ఎన్నికల వ్యయ పరిశీలకులు బాబు రాయ సమక్షంలో అదనపు కలెక్టర్ డేవిడ్ తో కలిసి 101డోర్నకల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, 102 మహబూబాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల పరిధిలో ఎన్నికలలో ఏర్పాటు చేసే ఈ.వి. ఎమ్. లు, వి.వి. ఫ్యాట్ లపై రాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 30 వ తేదీన జరగనున్న పోలింగ్ సందర్భంగా జిల్లాలోని 539 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా డోర్నకల్ నియోజకవర్గంలో 256, మహబూబాబాద్ నియోజకవర్గంలో 283 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థులు రెండు నియోజకవర్గాలలో 26 మంది ఉన్నట్లు ఎన్నికల అధికారి వివరించారు. డోర్నకల్ నియోజకవర్గ పోలింగ్కు ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంగా మరిపెడలో ని సెయింట్ ఆగ స్టీన్ స్కూల్లో ఏర్పాటు చేశామని, అలాగే మహబూబాబాద్ నియోజకవర్గ పోలింగ్ కు ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంగా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో ఏర్పాటు చేశామన్నారు.డోర్నకల్ నియోజకవర్గంలో 32 రూట్లు ఉండగా మహబూబాబాద్ నియోజకవర్గంలో 32 రూట్లు ఏర్పాటు చేశామన్నారు రూట్ ఆఫీసర్గా సెక్టోరల్ అధికారులు ఉంటారని ప్రతి సెక్టోరల్ అధికారి పరిధిలో 3 నుండి 4 పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. ఈ పోలింగ్ కేంద్రాలన్నీ రెండు లేక మూడు కిలోమీటర్ల పరిధిలోనే ఉంటాయని ప్రతి నియోజకవర్గంలో మొబైల్ గా 32 మంది సెక్టార్ అధికారులు అందుబాటులో ఉంటూ పర్యటిస్తూ ఉంటారని వీరి వద్ద అదనంగా ఏర్పాటు చేసిన బ్యాలెట్ యూనిట్లు కంట్రోల్ యూనిట్లు సిద్ధంగా ఉంటాయని పోలింగ్కు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. 101డోర్నకల్ నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులు 14 మందితో నోటా కలిపి 15 మంది గా బ్యాలెట్ సంఖ్యను చెప్పారు. అందుకుగాను డోర్నకల్ నియోజకవర్గంలోని 256 పోలింగ్ కేంద్రాలకు 125 శాతంగా 320 కంట్రోల్ యూనిట్లు మరో 320 బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందని దాంతో పాటుగా 140 శాతంగా 358 వివి ప్యాట్లు ఏర్పాటు చేశామన్నారు. 102 మహబూబాబాద్ నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులు 12మందితో నోటా కలిపి 13 గా బ్యాలెట్ సంఖ్యను చెప్పారు. అందుకుగాను నియోజకవర్గంలోని 283 పోలింగ్ స్టేషన్లకు 125 శాతం చొప్పున 353 కంట్రోల్ యూనిట్లు మరో 353 బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందని దాంతో పాటుగా 140 శాతంగా 396 వివి ప్యాట్లు ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ యూనిట్లను బ్యాలెట్ యూనిట్లను వి.వి ప్యాట్లను డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి ఈనెల 29వ తేదీన పోలింగ్ అధికారులకు ఇవ్వడం జరుగుతుందని, తిరిగి 30వ తేదీ సాయంత్రం పోలింగ్ అనంతరం ఈవీఎంలను వివి ఫాట్లను మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లో పోలింగ్ సామాగ్రితో పాటు అప్పగించాల్సి ఉంటుందన్నారు. ఈ ర్యాన్డమైజేషన్ ప్రక్రియలో ఎలాంటి అనుమానాలున్న పార్టీ ల ప్రజా ప్రతినిధులు నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ సమీక్షలో డోర్నకల్ రిటర్నింగ్ అధికారి నరసింహారావు మహబూబాబాద్ రిటర్నింగ్ అధికారి అలివేలు నోడల్ అధికారులు ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ పథకాలు ప్రజలను మోసం చేసే పథకాలు

- ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి
- ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్ రావు

**సూర్యాపేట విశాలభారతి:** సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రకటిస్తున్న పథకాలు ప్రజలను మోసం చేసే పథకాలని, ఆ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ నాయకుల మాటలను నమ్మి ఓట్లు వేస్తే తెలంగాణ రాష్ట్రం మరో శ్రీలంక రాష్ట్రంగా మారే అవశాలు ఉన్నాయని సూర్యాపేట నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్ రావు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పీఎన్ఆర్ టౌన్ షిప్ లో ఇంటింటికి తిరిగి బీజేపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, గృహాలక్ష్మీ పథకాల పేరుతో మంత్రి జగదీష్ రెడ్డి మరోమారు సూర్యాపేట జిల్లా ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని ఆయన విమర్శించారు. సూర్యాపేట పట్టణంలో ఏ పనులు ప్రారంభించిన అవి కేవలం ఒక కాంట్రాక్టర్ కు మాత్రమే అప్పగించి, కాంట్రాక్టర్ నుంచి మంత్రికి భారీగా ముడుపులు అందుతున్నాయని ఆయన అన్నారు. పేదలకు ఇండ్ల నిర్మాణం చేయడానికి మంత్రి జగదీష్ రెడ్డి తొమ్మిది సంవత్సరాలు పట్టిందని, ఆయన క్యాంప్ ఆఫీస్ కార్యాలయాన్ని తొమ్మిది నెలల్లో పూర్తి చేసుకున్నాడని అన్నారు. పేదల సంక్షేమ పట్టని మంత్రి జగదీష్ రెడ్డి ఓట్ల కోసం పేద ప్రజల చుట్టూ తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్ రెడ్డి మాయమాటలు నమ్మి రెండుసార్లు మోసపోయారని, మరోమారు వారి మాటలకు ప్రజలు మోసపోరని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పరిపాలన అంతం చేసి బీజేపీ పరిపాలన కావాలని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పాలకులు చేసిన నష్టాన్ని పూడ్చలంటే రాష్ట్రంలో బీజేపీతోనే సాధ్యం అన్నారు. రాంరెడ్డి దామోదర్ రెడ్డి సిండికేట్ పరిపాలన ప్రజలు గతంలోనే చూశారని, మంత్రి జగదీశ్వర్ రెడ్డి గెలుపు కోసమే కాంగ్రెస్ పార్టీ బలహీనమైన అభ్యర్థిని ప్రకటించిందని, సూర్యాపేట నియోజకవర్గ ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పుతారని అన్నారు. మంత్రి జగదీష్ రెడ్డి రెండుసార్లు ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే, ఏనాడు కూడా ప్రజలకు ఆయన అందుబాటులో లేడని అన్నారు. ముఖ్యమంత్రి కి కుడిభుజం అంటూ చెప్పుకుంటూ క్రిందిస్థాయి కార్యకర్తలను పట్టించుకోలేదన్నారు. నవంబరు 30న జరిగే శాసన సభ ఎన్నికల్లో మంత్రి జగదీష్ రెడ్డి ని ఆయన అనుచరులే ఓడిస్తారని ఆయన అన్నారు.



# బత్తుల లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తాం...!

- సీపీఎం, బీఆర్ ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ లో చేరిక
- మాజీ సిఎల్పీ నేత కుందూరు జానారెడ్డి

**మిర్యాలగూడ విశాలభారతి:** మిర్యాలగూడ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన బత్తుల లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. ఆదివారంసిపిఎం కౌన్సిలర్అబ్దుల్ ఘని, బీఆర్ ఎస్ కౌన్సిలర్ జావేద్, మాజీకౌన్సిలర్లు ఆలగడప గిరిధర్, యాదగిరి సహా పలువురు జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కుందూరు జానారెడ్డి మాట్లాడారు. ఈ నెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన మేనిఫెస్టో ను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి రఘు వీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# వడాయిగూడెం బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్

- బబ్బూరి పోశెట్టి గౌడ్ కాంగ్రెస్ లో చేరిక

**భువనగిరి విశాలభారతి:** మండలంలోని వడాయిగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బబ్బూరి పోశెట్టి గౌడ్ ఆదివారం భువనగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎలిమిటి కృష్ణారెడ్డి సర్పంచ్, ఎల్లంల జంగయ్య జిలుగు సతీష్ ,మడెపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 23, 24 తేదీలలో హోం ఓటింగ్.

- మహబూబాబాద్ రిటర్నింగ్ అధికారి అలివేలు వెల్లడి.



**మహబూబాబాద్ విశాల భారతి:** హోమ్ ఓటింగ్ కార్యక్రమాన్ని ఈనెల 23, 24 తేదీలలో చేపడుతున్నట్లు మహబూబాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అలివేలు తెలిపారు. ఆదివారం హోమ్ ఓటింగ్ కార్యక్రమం పై 102 మహబూబాబాద్ నియోజకవర్గ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అలివేలు వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వివరిస్తూ నియోజకవర్గ పరిధిలో 12 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నందున నియోజకవర్గంలో 30 రూట్స్ లోగుర్తించిన 471 మంది హోమ్ ఓటర్లు నివేదికను సంబంధిత పార్టీ ప్రతినిధుల కు అందజేస్తూ ఈనెల 23 , 24 తేదీలలో హోమ్ ఓటింగ్ చేపడుతున్నామని ఓటర్లు అందుబాటులో ఉండాలని విజ్ఞప్తి చేశారు. హోమ్ ఓటింగ్కు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినందున ఓటర్లు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు.



# కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం

- చిట్యాలలో వేముల విపుల్ ప్రచారం

**చిట్యాల విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం తనయుడు వేముల విపుల్ అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నకిరేకల్ నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగాలంటే వేముల వీరేశాన్ని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టో పథకాలు ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏళ్ల మల్లేష్, ఏర్పుల పరమేష్, బొల్లాలి రాంరెడ్డి కొసనం అశోక్ కమ్మంపాటి సైదులు సళ్ళ రాజు కళ్లెం నరసింహ పాల్గొన్నారు.

# ఇంటింటికి ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ఆర్మూర్, విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం నందిపేట్ మండలంలోని మాయాపూర్ గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ దూద వెంకటేష్ మాట్లాడుతూ చేతు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలను అమలు చేస్తుందని ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో దూద రమేష్, బ్యాగరి సంజీవ్, మోర్తాడ్ ముత్యం, భోజేందర్, ఇసాపల్లి ముత్తెన్న,అల్లేపు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు అంతా ఒక కుటుంబం

- ఎలాంటి సమస్యా వచ్చిన నేరుగా సంప్రదించండి
- రిటైర్డ్ పోలీసు సంఘం ఏర్పాటు చేసుకోవడం, సమాజిక సేవలో ఉండడం అభినందనీయం
- రిటైర్మెంట్ వయసుకే కానీ ఆలోచనకు, మనసుకు కాదు



**సూర్యాపేట విశాలభారతి:** పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పని చేసి ప్రజలకు సేవలు అందించి ఉద్యోగ విరమణపొందిన సిబ్బంది జిల్లాలో రిటైర్డ్ పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనియమని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సంఘం కార్యకలాపాల కోసం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద సిబ్బంది సొంత స్థలంలో స్వతహాగా ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక భవనాన్ని ఆదివారం జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ప్రారంభించినారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగం నుండి రిటైర్డ్ అయినా మీ సేవలు గుర్తించదగినవి అన్నారు. రిటైర్డ్ అనేది వయస్సు కే కానీ మనసు కు కాదు, సమాజిక సేవలో ముందు ఉండడం అభినందనీయం అన్నారు. పోలీసు అంతా ఒక కుటుంబం, మీకు ఎలాంటి సమస్య వచ్చిన నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. కార్యాలయం ఏర్పాటు వల్ల ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బంది ఒక చోట కలుసుకుని సంతోషాలను పంచుకోవచ్చని, ఇతరులకు మోటివేషన్ గా ఉండాలి అన్నారు. సంఘం శాశ్విత భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కార్యాలయం నందు కావలసిన టేబుల్స్, చైర్స్, అల్మరాలను ఎస్పీ అందించారు.సంఘం కార్యాలయం నందు అధ్యక్ష, కార్యదర్శులను కూర్చోబెట్టి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపినారు. సంఘం అధ్యక్షులుగా రిటైర్డ్ ఎ ఎస్ఐ రంగారెడ్డి, కార్యదర్శి గా రిటైర్డ్ ఎస్ ఐ అబ్దుల్లా, కోశాధికారిగా రిటైర్డ్ ఎ ఎస్ఐ కోటయ్య, వ్యవస్థాపక సభ్యులు కృష్ణారెడ్డి నీయముతులైనారు. రిటైర్డ్ ఉద్యోగస్తులు డీఎస్పీ పెంచలయ్య, సీఐ బాస్కర్ రావు, ఎఎస్ఐ గఫూర్, హుస్సేన్, రషీద్ ఖాన్, వైయస్ ప్రెసిడెంట్ ఎ ఎస్ఐ శంకర్ గౌడ్, అమృతా రెడ్డి, హోమ్ గార్డ్స్ సుగుణ, బాలకృష్ణ, వెంకటయ్య సభ్యులుగా ఉన్నారు. సంఘం స్థాపనకు స్వచ్ఛంద విరమణ పొందినఎ ఎస్ఐ క్రిష్ణారెడ్డి కృషి చేశారని అధికారులు అభినందించారు.ఈ సమావేశం నందు సూర్యాపేట సబ్ డివిజన్ డీఎస్పీ నాగభూషణం, పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఆర్ ఐ నారాయణ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఓట్లు మనవి ..కోట్ల సంపాదన వారిది

- శ్రీకాంత్ చారి తల్లికి బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన గౌరవం ఏది
- దగా కోరు బిఆర్ఎస్ కు తగిన బుద్ధి చెప్పాలి
- నీళ్లు ఆరబోసి వీర తిలకం దిద్దిన మహిళలు
- బిఎస్పి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్

**సూర్యాపేట విశాలభారతి:** తెలంగాణ ప్రభుత్వం వస్తే ఉద్యోగాలు వస్తాయని విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుని తెలంగాణ సాధించుకుంటే, ఉద్యోగాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఎస్పి పార్టీ సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి జానయ్య యాదవ్ అన్నారు. సూర్యాపేట పట్టణంలోని 43 వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నీళ్లు ఆరపోసి వీర తిలకం దిద్దారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రూపాయల భోజనం చేసి లక్షల రూపాయలు ఖర్చు చేసి ఉద్యోగాల కోసం కష్టపడి చదివితే, పేపర్ లీకేజీ చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడారని అన్నారు. పరీక్షలు వాయిదా పడడంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులను ప్రేమ పేరుతో ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.పేద ప్రజలు రేషన్ కార్డు, డబల్ బెడ్ రూమ్ ఇల్లు, నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి మోసం చేసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు.అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీకి చెప్పుతో కొట్టినట్టుగా ఏనుగు గుర్తుకు ఓటేయాలని కోరారు.అనంతరం 300 మంది కార్యకర్తలు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి బిఎస్పి పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గండూరి పావని కృపాకర్, అన్నేపర్తి రాజేష్, మాజీ కౌన్సిలర్ మీర్ పర్వీన్ అక్బర్, పెరుమాళ్ళ కళ్యాణి, కుంచం శ్రీకాంత్, వేముల మోహన్, గోరంట్ల కృష్ణ, దోరేపల్లి వెంకటేశ్వర్లు, బత్తుల సరిత తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే కెసిఆర్ మళ్ళీ రావాలి

- గడిచిన ఐదేళ్ల కాలంలో ఒక్క రాజకీయ హత్య లేకుండా శాంతియుతపాలన అందించాం
- అభివృద్ధిని చూసి ఓటేయండి

**మునగాల విశాల భారతి:**కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్ మునగాల మండలంలోని నరసింహుల గూడెం, రేపాల, సీతానగరం, విజయరాఘవపురం, జగన్నాధపురం, కృష్ణానగర్, బరాకత్ గూడెం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి డప్పు చప్పులతో పూలు జల్లుతో ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ గత పాలకులు ఈ ప్రాంతాన్ని విస్మరిస్తే నేను భుజాన ఎత్తుకొని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి దిశగా తీసుకుపోతున్నాను అని అన్నారు. ఒక్క పంటకు కూడా నీళ్లు లేని ఈ ప్రాంతంలో కాలేశ్వరం ద్వారా నిలందించాం అని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి గతంలో ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాం మరి వారు చేసిన అభివృద్ధి ఎక్కడుంది అని ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో తోడుగా లేనివారు నేడు మన అభివృద్ధికి ఏం సహకరిస్తారు అని అన్నారు. మీ కష్టాల్లో నేనున్న, కరోనాలో నేనున్నా, మీకు ఆపద వచ్చిన ప్రతిసారి మీకు అండగా ఉన్న, నిరంతరం ప్రజల్లో ఉన్నా ఈ కాంగ్రెస్ అభ్యర్థి ప్రజల్లో లేరు, మన ఆపతిలో లేరు ఎప్పుడు మనకు కనిపించలేదు కానీ నేడు ఎన్నికలు వస్తున్నాయని వస్తున్నారు. ఆలోచించి నిర్ణయం తీసుకోండి. అభివృద్ధి చేస్తున్న తనని ఆశీర్వదించండి అని అన్నారు. 2100 కోట్ల అభివృద్ధి పనులు మీ కళ్ళముందు ఉన్నాయి అని అన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించండి మరింత సేవ చేస్తా అని అన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుండి పలువురు బిఆర్ఎస్ లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఇంచార్జి శశిధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తొగరు రమేష్, సీనియర్ నాయకులు అజయ్ కుమార్, పచ్చిపాల వేణు యాదవ్, ఓయూ నేత కందుల మధు, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మండల పార్టీ నాయకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్ఎంపీ వైద్యులు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలి

- ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉత్తమ్ పద్మావతి



**కోదాడ విశాల భారతి:**గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీలకు అండగా ఉంటానని కోదాడ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో చిలుకూరు మండల అధ్యక్షులు తురక ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన ఆర్ఎంపి, పిఎంపీల ఆత్మీయ సమ్మేళనంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు తో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. 30న జరగనున్న ఎన్నికల్లో ఆర్ఎంపీలు తనకు మద్దతుగా నిలిచి అండగా నిలవాలన్నారు. కరోనా సమయంలో గ్రామాల్లో పేదలకు తమ ప్రాణాలను పణంగా పెట్టి వైద్య సేవలు అందించారని ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ప్రజలందరికీ తెలంగాణ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గడపగడపకు తీసుకువెళ్లి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు కృషి చేయాలి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆర్ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీల సంఘం పక్షాన కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో రామినేని శ్రీనివాసరావు, ఆలేటి రాంబాబు, జిల్లా అధ్యక్షులు భుజంగరావు, కార్యదర్శి వెంకన్న గౌడ్, క్రమ శిక్షణ అధ్యక్షులు ఎస్పీ వెంకటప్పయ్య, చిలుకూరు అధ్యక్షులు తురక ఉపేందర్, అనంతగిరి అధ్యక్షులు సురభి కాంతారావు, మునగాల శ్రీశైలం, నడిగూడెం భాస్కర తదితరులు పాల్గొన్నారు.



## మోడీ సహాయంతో తెలంగాణపై మళ్లీ ఆంధ్ర పెత్తనానికి కుట్రలు

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**బాల్కొండ, విశాల భారతి:** ప్రాణ త్యాగాలతో, చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ సాధించిన తెలంగాణ ఏర్పాటును తల్లిని చంపి బిడ్డను బ్రతికించారని ప్రధాని మోడీ ప్రశ్నించారని, స్వయంగా ఆయనే పార్లమెంట్ సాక్షిగా తెలంగాణపై విషం కక్కారని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి, బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సహాయంతో ఆంధ్ర శక్తులన్నీ తెలంగాణపై పెత్తనం చేసేందుకు పాత రోజులు మళ్లీ తెచ్చేందుకు కుట్రలు పన్నుతున్నాయని, ప్రజలు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని మంత్రి కోరారు. ఆదివారం బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలంలోని సుదర్శన్‌నగర్ తాండ, సంతోష్‌నగర్ తాండ, జాగీర్యాల్, కుప్కల్, కుప్కల్ తాండలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వస్తే తానే సిఎం అని చెప్పుకుంటున్న కిషన్ రెడ్డి,ఆనాడు తెలంగాణా ఉద్యమం కోసం రాజీనామా చేయమంటే పారిపోయాడని ఎద్దేవా చేశారు. తెలంగాణ పచ్చగా మారి ఇక్కడి ప్రజలంతా బాగుపడుతున్న సందర్భాన్ని ఆంధ్ర శక్తులు చూ విడలేక పోతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ ఇలా పచ్చగా ఉందనే వారికి కళ్లు మండుతున్నాయని, ప్రజలు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని కోరారు. తెలంగాణ కేసీఆర్ చేతుల్లోనే పదిలంగా ఉంటుందని, మరింత అభివృద్ధి,సంక్షేమం జరుగుతుందని ఆయన అన్నారు. గిరిజన తాండలను పంచాయతీలుగా మార్చి వారి తాండలను వారే పాలించేలా చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల, స్థానిక గ్రామనాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## బిజెపి మేనిఫెస్టోతో బీఆర్ఎస్, కాంగ్రెస్ లకు దిమ్మ తిరిగింది

- బాల్కొండ బిజెపి అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ

**బాల్కొండ, విశాల భారతి:** వరి వేస్తే ఉరి అన్నవారు కావాలా, లేక క్వింటాల్ వరికి రూ.3100 మద్దతు ధర ప్రకటించిన బిజెపి ప్రభుత్వం కావాలా నిర్ణయించుకోవాలని బాల్కొండ బిజెపి అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. వేల్పూర్ మండలం అక్లూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ బిజెపి మేనిఫెస్టోలో తెలంగాణ ప్రజలకు లబ్దిచేకూరే అనేక పథకాలను పొందుపరిచారన్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో చేసిన ప్రతీ పనిలో కమిషన్ తీసుకున్నాడని ఆరోపించారు. బాల్కొండలో బిజెపిని గెలిపిస్తే అర్హులందరికీ ఇండ్లు,పెన్షన్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కాగా భీమ్‌గల్ మండల బెజ్జోరా గ్రామానికి చెందిన మాదిగ కుల సంఘం సభ్యులు ఎస్సి వర్గీకరణకి మోదీ కృషి చేయడంతో అన్నపూర్ణమ్మ సమక్షంలో బీజేపీలో చేరారు. మానాల వీరున్ తాండకు చెందిన బిఆర్ఎస్ పార్టీ ఉపసర్పంచ్ లౌద్య నరహరి అన్నపూర్ణమ్మ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్,మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డి,కాంతయ్య, రాజగంగారాం,ప్రశాంత్,బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కోదాడలో స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేస్తాం

- కారు గుర్తును గెలిపించుకుందాం భవిష్యత్తును నిర్మించుకుందాం
- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**కోదాడవిశాల భారతి:**కోదాడ యువతకు స్పోర్ట్స్ స్టేడియంలో ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే, కోదాడ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్ పేర్కొన్నారు. కోదాడలోని కట్టకొమ్ము గూడెం రోడ్ లోని క్రీడా మైదానంలో పట్టణానికి చెందిన యువకులను ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందమైన, సుందర పట్టణంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అన్నారు. కోదాడలో శాంతి భద్రతల విషయంలో రాజీలేదన్నారు. గత పాలనలో భీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి చెప్పే బాధ్యతను యువతదే అన్నారు. కోదాడ అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టే బాధ్యతను యువతనే తీసుకోవాలన్నారు. కారు గుర్తును గెలిపించుకుని భవిష్యత్తును నిర్మించుకుందాం అన్నారు.



## విద్యానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడిగా యంఎ పాషా

**మూడోసారి ఏకగ్రీవ ఎన్నిక**

**ఆమనగల్లు, విశాలభారతి** :విద్యా నగర్ కాలనీ వెల్ఫర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. విద్యానగర్ కాలనీకి సంబంధించిన దీర్ఘకాలిక, అత్యంత కీలకమైన సమస్యను పరిష్కారం చేసినందుకుగాను కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, అధ్యక్షుడు ఎంఏ పాషాను మూడవసారిగా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు పాషా మాట్లాడుతూ విద్యానగర్ కాలనీ అభివృద్ధికి పాటుపడుతూ, మౌలిక వసతులు కనీస అవసరాలు సాధించేందుకు కమిటీ సభ్యులతో కలిసి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పనిచేసి మన విద్యానగర్ కాలనీ మన కల్వకుర్తి నియోజకవర్గంలో ఒక ఆదర్శ కాలనీగా చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు ఎంఏ పాషా, ఉపాధ్యక్షులు వర్కల శేఖర్, జనరల్ సెక్రెటరీ జంగయ్య, కోశాధికారి సుదర్శన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు మ్యాక వెంకటేశ్వర రెడ్డి, వి.సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు ప్రధానోపాధ్యాయులు అత్యా సార్, పాండు కమిటీ సభ్యులు ఆర్టీసీ పర్వతాలు, ఆరిఫ్, రాములు, ఆనంద్ యాదగిరి,బాబు మరియు పోలేపల్లి సత్యం, విఠాయిపల్లి విష్ణు,మధు అయ్యగారు పాల్గొన్నారు.

## ఓటర్ స్లిప్పుల పంపిణీలో వేగం పెంచాలి

- అంధులు, వికలాంగులు,చెవిటి, మూగ వారికి పూర్తి స్థాయి వసతుల కల్పన
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్ వెంకట్రావ్



**సూర్యాపేట విశాలభారతి:** జిల్లాలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ నెల 22 నాటికి ఇంటింటా ఓటర్ స్లిప్పులు పంపిణీ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం నాలుగు నియోజక వర్గాల ఆర్.ఓలు,ఏఆర్ఒలతో పాటు అదనపు కలెక్టర్లు సి.హెచ్. ప్రియాంక, ఏ. వెంకట్ రెడ్డి లతో వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని నియోజక వర్గాలలో ఓటర్ స్లిప్పులు పంపిణీ ప్రక్రియ మరింత వేగం పెంచి వచ్చే 22 తేదీ నాటికి పూర్తి చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పోలింగ్ రోజున వికలాంగులు, అంధులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సూచించినా నిర్దిష్టమైన ప్రణాళికతో అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు ఉండాలని సూచించారు. ముక్యంగా అంధులు, ముగా, చెవిటి వారికి ఇప్పటికే ఓటింగ్ పై అన్నినియోజక వర్గాలలో మాస్టర్ ట్రైనర్స్ తో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చామని తెలిపారు. అన్ని నియోజక వర్గాలలో 16739 మంది వికలాంగులు,అలాగే అంధులు 2113 మంది, చెవిటి మూగ వారు 1814 మంది ఉన్నారని ఇప్పటికే 1201 పోలింగ్ కేంద్రాలలో 728 వీల్ ఛైర్స్ అందుబాటులో ఉంచాని, అలాగే వీరికి సేవాలందించుటకు వాలంటిరీలను అలాగే ఆటోలను సమకూర్చడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ల సెల్ నెంబర్లు ఆయా నియోజక వర్గాలలో అందరి అందుబాటులో ఉండాలని , ఎక్కడకూడా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా నిర్దేశించిన విదంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ వెబెక్స్ లో డి డబ్ల్యూఓ జ్యోతి పద్మ, తహశీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సొంత గూటికి మాజీ పిఎసిఎస్ చైర్మన్

**నారాయణఖేడ్, విశాల భారతి:**నారాయణాఖేడ్ నియోజికవర్గంకంగ్టి పట్టణనికి చెందిన మాజీ పిఎసిఎస్ చైర్మన్ మనోజ్ పటేల్, షేట్కార్ సిద్దప్ప, భూరే పండరి, యూసుఫ్,అస్తుర్ నర్షుగొండ, మునిష్, రాజు, పండరి, భీమప్ప గార్లకు సురేష్ షేట్కార్, నాగేష్ షేట్కార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సురేష్ షేట్కార్ మాట్లాడుతూ.. నారాయణాఖేడ్ నియోజికవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సంజీవ్ రెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరిక



**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం పల్లికోండ గ్రామానికి చెందిన గ్రామ అభివృద్ధి కమిటి సభ్యులు ఎనిమిది మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి సునీల్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు

## గోపాలమిత్రుడి మృతికి ఆర్థిక ఇబ్బందులే కారణం



**మహబూబాబాద్ విశాల భారతి:** బయ్యారం మండలం ఉమ్మడి కంబాలపల్లి పంచాయతీ కోయగూడెం గ్రామానికి చెందిన గోపాలమిత్ర సూర్ణపాక సుదర్శన్ సుమారు (40 సం) ఇతను 2011 నుంచి గోపాల మిత్రగా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా అతని భార్య ఆస్తమా జబ్బుతో ఇబ్బంది పడుతున్న తరుణంలో అతను గోపాలమిత్రకు రిపోర్టు డబ్బులు కట్టలేక ఇబ్బంది పడుతూ ఇటు తన భార్యను పిల్లలను చూసుకోలేక ఆర్థిక భారం మనోవేదనకు గురయ్యాడు ఈ తరుణంలోనే సంస్థ తనను తీసివేయడంతో మంచానపడ్డాడు ఇదిలా ఉండగా చాలీచాలని వనరులతో వచ్చే గౌరవభృతి సరిగా రాకపోవడం తో గత రాత్రి మృతి చెందాడు అతనికి ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు నిరుపేద పేద ఆదివాసి ఇల్లు కూడా సరిగ్గా లేని వ్యక్తి అతని మేనమామ అన్న తమ్ముళ్లు చెప్పిన కథనం ప్రకారం గోపాలమిత్ర నుండి తీసివేయడంతో మనోవేదనతో బాధపడుతూ చనిపోవడం జరిగిందని తన భార్యకు తన పిల్లలకు ఆదరువు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు పశు వైద్యంలో ఇలాంటి గోపాల మిత్రలు చాలీచాలని భృతితో, ప్రభుత్వం తరపునుంచి ఉద్యోగ భద్రత లేకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఇబ్బంది పరిస్థితులలో అనేక మంది మృత్యువాత పడుతున్నారని ఇప్పటికైనా వారి కుటుంబాలను ఆదుకోవాలని గ్రామ ప్రజలు ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily
9
సోమవారం,
20.11. 2023
హైదరాబాద్



## ఒకే ఫ్రేమ్‌లో నేచురల్ స్టార్ నాని, సల్మాన్ ఖాన్

నేచురల్ స్టార్ నాని తన చిత్రం 'హాయ్ నాన్న'ని టీమ్‌తో కలిసి జోరుగా ప్రమోట్ చేస్తున్నారు. శౌర్యువ్ దర్శకత్వంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈరోజు, ఇండియా Vs ఆస్ట్రేలియా క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ షోలో స్టార్ స్పోర్ట్స్ తెలుగులో కనిపించారు నాని. స్టార్ స్పోర్ట్స్ హిందీ ఛానెల్‌లో కనిపించిన బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌ను కలిశారు. ఇద్దరు స్టార్‌లను ఒకే ఫ్రేమ్‌లో చూడటం అభిమానులకు ఆనందాన్ని ఇచ్చింది. ఇటివలే, హాయ్ నాన్న టీమ్ షేర్ చేసిన ఫోటో, వీడియోలో రాజకీయ నాయకుడిగా కనిపించారు నాని. 'హాయ్ నాన్న' ప్రచారంలో భాగంగా తన పొలిటికల్ పార్టీ మేనిఫెస్టోను ఆయన అనౌన్స్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందరూ ఈ ఆలోచనను మెచ్చుకున్నారు. నాని అండ్ హాయ్ నాన్న టీమ్ సినిమాని వినూత్నంగా అద్భుతంగా ప్రమోట్ చేస్తోంది.



## మంగళవారం చూస్తున్నప్పుడు 'అరుంధతి' గుర్తొచ్చింది

- దిల్' రాజు

యువ దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన సినిమా 'మంగళవారం'. 'ఆర్ఎక్స్ 100', 'మహాసముద్రం' చిత్రాల తర్వాత ఆయన తీసిన చిత్రమిది. పాయల్ రాజ్ పుత్ ప్రధాన పాత్రలో నటించారు. ఈ చిత్రానికి అజయ్ భూపతి 'A' క్రియేటివ్ వర్క్స్ నిర్మాణ భాగస్వామి. ముద్ర మీడియా వర్క్స్ పతాకంపై స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎంతో కలిసి నిర్మించారు. నందిత శ్వేత, దివ్య పిళ్లై, రవీంద్ర విజయ్, అజయ్ ఘోష్, శ్రీ తేజ్, శ్రవణ్ రెడ్డి సినిమాలో ప్రధాన తారాగణం. నవంబర్ 17న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైంది. సినిమాకు బ్లాక్ బస్టర్ టాక్ లభించింది. మంచి వసూళ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. అగ్ర నిర్మాత, చిత్రాన్ని నైజాంలో పంపిణీ చేసిన 'దిల్' రాజు మాట్లాడుతూ '' మనం చాలా మంది దర్శకులను చూశాం. కొంత మంది దర్శకులు ప్రేక్షకులకు నచ్చేలా తీర్చిదిద్దడానికి ట్రై చేస్తారు. కొందరు తాము అనుకున్నది చెప్పాలని ట్రై చేస్తారు. హిస్టరీలో బాలచందర్ గారు, వంశీ గారు, రామ్ గోపాల్ వర్మ గారు, కృష్ణవంశీ గారు వంటి దర్శకులు తాము అనుకున్న పాయింట్ చెప్పాలని ట్రై చేస్తారు. 'మంగళవారం' పోస్టర్ పంపించాడు. అది నాకు ఆసక్తిగా అనిపించింది. 'సార్... మీరు అరగంట టైం ఇస్తే కథ చెబుతా' అన్నాడు. కథ విన్నా. అప్పుడు షూటింగుకు వెళ్లబోతున్నాడు. కొత్తగా ట్రై చేస్తున్నావని చెప్పా. నాకు ఈ కథ విన్నప్పుడు వంశీ గారి 'అన్వేషణ' గుర్తుకు వచ్చింది. ఆ సినిమా ఎలా ఎంజాయ్ చేశానో... కథ విన్నప్పుడు అలా ఎంజాయ్ చేశా. ముందుకు వెళ్ళమని చెప్పా. అప్పుడు స్వాతి గారు ప్రొడ్యూస్ చేస్తున్నారని చెప్పాడు. . 'ముందు నాకు చూపించండి. బావుంటే ఓకే. ఒకవేళ మిస్ ఫైర్ అయితే కష్టం' అన్నాను. బుధవారం ఉదయం షో వేశారు. కథ నాకు తెలిసినా సాధారణ ప్రేక్షకుడిలా చూశా. ఇంటర్వెల్ అవ్వగానే ఆసక్తిగా ఉందని చెప్పా. సెకండాఫ్ ఫస్ట్ 20 నిమిషాలు 'వావ్' అనిపించాడు. 'అరుంధతి' సినిమా ఇక్కడే చూశా. అప్పుడు ఏదైతే ఫీల్ కలిగిందో... అలా అనిపించింది. ప్రీ క్లైమాక్స్ నుంచి ఒక్కో పార్ట్ రివీల్ చేస్తూ వచ్చాడు. ఈ రోజు ప్రేక్షకులు సినిమా బావుందని అనడానికి కారణం క్లైమాక్స్, ఆ ట్విస్టులు. ఈ సినిమా సక్సెస్ క్రెడిట్ దర్శకుడికి ఇవ్వాలి. కొత్తవాళ్లుతో బలగం, బేబీ, సామజవరగమన, ఇప్పుడీ 'మంగళవారం' విజయాలు ఉదాహరణ. ఇది ఆగే సినిమా కాదు... ఇంకా పెద్ద సినిమా అవుతుంది'' అని చెప్పారు.

## 24న కోట బొమ్మాళి పీఎస్



రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో 'అర్జున ఫల్గుణ' ఫేమ్ తేజ మార్ని తెరకెక్కించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. శ్రీకాంత్, వరలక్ష్మి శరత్ కుమార్ కీలకపాత్రలలో నటించిన ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌పై బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని నవంబర్ 24న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలయ్యేందుకు ముస్తాబైంది. ఈ సినిమాను సెన్సార్ చేసిన అధికారులు U/A సర్టిఫికేట్‌తో పాటు.. ఉత్కంఠ ను కలిగించే కథనంతో వస్తున్న ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులకు అంది స్తున్నందుకు చిత్రయూనిట్‌ను అభినం దించారు. ఇప్పటి వరకు ఈ సినిమాకు సంబంధించి విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై భారీగా అంచనాల ను పెంచేయగా.. సెన్సార్ అధికారులు కూడా సినిమాపై ప్రశంసలు కురిపించ డంతో చిత్రబృందం సినిమా సక్సెస్‌పై ధీమాగా ఉంది. ప్రస్తుతం ఎన్నికల సీజన్ నడుస్తుండటం, ఇందులో అందుకు సంబంధించిన పాయింట్ ఉండటం సినిమాకు మరింత ప్లస్ అవుతుందని యూనిట్ భావిస్తోంది. పాటలు, టీజర్, కూడా అదే నిరూ పించాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని నవంబర్ 24న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నామని, ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ సినిమా ఇస్తుందని ఈ సందర్భంగా మేకర్స్ తెలిపారు.

## డిసెంబర్ 15న పిండం



హారర్ జానర్ చిత్రాల పట్ల ప్రేక్షకుల్లో ఎప్పుడూ మంచి ఆసక్తి ఉంటుంది. అయితే మన దగ్గర పూర్తిస్థాయి హారర్ చిత్రాలు రావడం చాలా అరుదు. కొన్ని చిత్రాలలో రొమాంటిక్ లేదా కామెడీ ట్రాక్ ల వల్ల హారర్ మోతాదు తగ్గిపోతుంది. అలాంటి ట్రాక్ ల జోలికి పోకుండా, కేవలం ప్రేక్షకులను భయపెట్టడమే లక్ష్యంగా తెలుగులో అసలుసిసలైన హారర్ చిత్రం రాబోతోంది. ప్రముఖ హీరో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. త్వరలోనే ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు అసలైన హారర్ అనుభూతిని అందించడానికి రాబోతుంది. తాజాగా 'పిండం' సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెన్సార్ సభ్యులు ఈ మూవీని చూసి థ్రిల్ అయ్యారు. ఈ మధ్య కాలంలో ఈస్థాయిలో భయపెట్టిన హారర్ చిత్రాన్ని చూడలేదని అభిప్రాయపడ్డారు. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకు, తర్వాత ఏం జరుగుతుందన్న ఉత్కంఠను రేకెత్తిస్తూ అద్భుతంగా రూపొందించారని చిత్ర బృందాన్ని ప్రశంసించారు. హైదరాబాద్ లో డిసెంబర్ 7వ తేదీన సాయంత్రం 'పిండం' ప్రీ రిలీజ్ వేడుక అత్యంత వైభవంగా జరగనుంది. ఈ వేడుకకు చిత్ర బృందంతో పాటు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరు కాబోతున్నారు. ఈ వేడుకను ఆద్యంతం ఆసక్తికరంగా, విభిన్న రీతిలో, సినిమా కు తగినట్లుగా సరికొత్త అనుభూతిని కలిగించేలా ప్లానింగ్ చేస్తున్నారు చిత్ర బృందం. హారర్ జానర్ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'పిండం' చిత్ర విడుదల తేదీని తాజాగా మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాని డిసెంబర్ 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల చేయబోతున్నట్లు తెలిపారు.



## తెల్లటి చీర కట్టుతో రుహాని శర్మ

చి.ల.సౌ అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులను అలరించిన ముద్దుగుమ్మ రుహాని శర్మ. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే నటిగా మంచి మార్కులు దక్కించుకుంది. టాలీవుడ్ లో రాణించాలి అంటే నటనతో కంటే అందాల ఆరబోతతో మంచి మార్కులు దక్కించుకోవాల్సి ఉంటుంది. అందుకే మొదటి సినిమా హిట్ అయినా రుహానికి ఎక్కువ ఆఫర్లు రాలేదు. హిట్, డర్టీ హరి సినిమాల్లో నటించి మరోసారి నటిగా మెప్పించిన రుహాని ఈ మధ్య కాలంలో అందాల ఆరబోత తో ఆకట్టుకుంటూ ఉంది. డర్టీ హరి సినిమాలో చీర కట్టులో కూడా అందంగా హాట్ గా కనిపించిన రుహాని ఇక మీదట వెండి తెరపై స్కిన్ షో చేసేందుకు సిద్ధం అన్నట్లుగా చెప్పకనే చెప్పింది. సినిమాల్లో ఇప్పటి వరకు పెద్దగా హాట్ అందాల ఆరబోత చేయని ఈ అమ్మడు సోషల్ మీడియాలో మాత్రం స్టార్ హీరోయిన్స్ కి ఏమాత్రం తగ్గకుండా అందాల విందు చేస్తూనే ఉంది. తాజాగా తెల్లటి చీర కట్టుతో కన్నుల విందు చేస్తోంది. హీరోయిన్స్ హాట్ గా రొమాంటిక్ గా కనిపించాలి అంటే తెల్లటి చీర కట్టుకోవాలనే అభిప్రాయం చాలా మందిలో ఉంటుంది. రుహాని శర్మ రొమాంటిక్ లుక్ కోసం ఇలా తెల్ల చీర కట్టి క్లీ వేజ్ షో చేసింది. తెల్ల చీర కట్టి తెల్ల గులాబీ చేతిలో పట్టుకుని సిగ్గు పడుతూ ఉన్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ రేంజ్ లో అందంగా ఉన్న రుహాని శర్మను స్టార్ హీరోలు, ఫిల్మ్ మేకర్స్ పట్టించుకోవడం లేదు అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోలు చూసిన తర్వాత అయినా రుహానికి ఆఫర్లు ఇస్తారేమో చూడాలి.



## సౌండ్ పార్టీలో నా పాత్ర క్రికెట్ టీం లో ధోనిలా ఉంటుంది

ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం 1గా రూపొందిన చిత్రం 'సౌండ్ పార్టీ'. వీజే సన్నీ, హ్రితిక శ్రీనివాస్ జంటగా నటించారు. జయ శంకర్ సమర్పణలో సంజయ్ శేరి దర్శకత్వం వహించారు. రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మాతలు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ అంచనాలు పెంచిన ఈ చిత్రం వరల్డ్ వైడ్ గా ఈనెల 24న గ్రాండ్ గా థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర హీరోయిన్ హ్రితిక శ్రీనివాస్ మీడియా మిత్రులతో ముచ్చటించారు.. "సీనియర్ నటి ఆమని మా అత్త అవటంతో చిన్నప్పుడు నుంచి సినిమాలపై ఆసక్తి ఉండేది. చైల్డ్ ఆర్టిస్ట్ గా కొన్ని సినిమాల్లో కూడా నటించాను. హీరోయిన్ గా తెలుగులో నాకు ఇది రెండో సినిమా. అల్లంత దూరాన తర్వాత నటించిన చిత్రమిది. సంజయ్ గారు కథ చెప్పినప్పుడు ఎక్సైటింగ్ గా అనిపించింది. ఇది ఒక కంప్లీట్ ఫన్ ఎంటర్టైనర్. కామెడీ తోపాటు కంటెంట్ కూడా ఉంది. ప్రేక్షకులు కచ్చితంగా ఎంటర్ టైన్ అవుతారని నమ్మకం ఉంది. ఇందులో నేను సిరి అనే పాత్రలో నటించాను. సిరి చాలా తెలివైన అమ్మాయి. నా పాత్ర సినిమాలో చాలా ఇంపార్టెంట్ గా ఉంటుంది. క్రికెట్ టీం లో ధోనీలా నా పాత్ర ఉంటుందని డైరెక్టర్ అంటుంటారు. సినిమా క్లైమాక్స్ లో ఎవరూ ఊహించని ట్విస్ట్ ఇస్తాను. లాస్ట్ లో వచ్చి ధోని ఎలా సిక్స్ లు కొడతారో అలా నా పాత్ర ఉంటుందని.. అలా అంటారు. సీరియస్ క్యారెక్టర్ అయినా సిచువేషన్ మాత్రం చాలా కామెడీగా ఉంటుంది. నా రియల్ లైఫ్ కి రిలేటబుల్ గా ఈ పాత్ర ఉంటుంది. అమాయకులైన తండ్రి కొడుకులు ఈజీ మనీ కోసం ఎలాంటి పనులు చేస్తారనేది ఈ సినిమా మెయిన్ కాన్సెప్ట్. ఈ పాయింట్ నే చాలా ఫన్నీగా దర్శకులు చూపించారు. ఇందులో బిట్ కాయిన్ గురించి కూడా ఉంటుంది. అది చాలా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తుంది. బిట్ కాయిన్ వాల్యూను చూపించారు. సన్నీకి టెలివిజన్ లో చాలా ఎక్స్పీరియన్స్ ఉంది. బిగ్ బాస్ లో ప్రేక్షకులు తనని ఎలా చూశారో సెట్ లోనూ ఆయన అలానే ఉంటారు. చాలా జెన్యూన్ గా, ఓపెన్ గా ఉంటారు. సౌండ్ పార్టీ టైటిల్ కి కరెక్ట్ ఎగ్జాంపుల్ గా నటించారు. సెట్ లో సన్నీ చాలా సపోర్ట్ చేశారు. తెలుగులో మాట్లాడేటప్పుడు కొన్ని పదాలు రాకపోతే ఆయనే నేర్పించారు. ఇందులో సిచువేషన్ కి తగ్గట్టుగా వచ్చే రెండు పాటలు మాత్రమే ఉంటాయి. మనీ మనీ అంటూ వచ్చే టైటిల్ సాంగ్ తో పాటు మరో సాంగ్ ఉంటుంది. డైరెక్టర్ సంజయ్ రైటింగ్ చాలా డిఫరెంట్ గా ఉంటుంది. ఆయన కామెడీ టైమింగ్ చాలా బాగుంటుంది. ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేశాం. నిర్మాతలు రవి సార్, మహేంద్ర గజేంద్ర గారు చాలా సపోర్ట్ చేశారు. ఈ బ్యానర్ లో వర్క్ చేయడం చాలా హ్యాపీగా ఉంది. ఇక ఎక్స్పరిమెంట్స్ సినిమాలు చేయాలని ఉంది. తెలుగులో నాకు నచ్చిన హీరోయిన్ సాయి పల్లవి. ఆమె చేసే రోల్స్ లాంటివి చేయాలని ఉంటుంది. హీరోల విషయంలో నాని అంటే నాకిష్టం" అన్నారు.

## మా 'అన్వేషి'ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు

### : నిర్మాత టి.గణపతి రెడ్డి



విజయ్ ధరణ్, సిమ్రాన్ గుప్తా, అనన్యా నాగళ్ల హీరో హీరోయిన్లుగా నటించిన హారర్ అండ్ కామెడీ ఫిల్మ్ 'అన్వేషి'. అరుణ శ్రీ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై వి.జె.ఖన్నా దర్శకత్వంలో టి.గణపతి రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. నవంబర్ 17న రిలీజ్ అయిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్‌లో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా... చిత్ర దర్శకుడు వి.జె.ఖన్నా మాట్లాడుతూ ''మేం చిన్నగా చేసిన ప్రయత్నాన్ని ప్రేక్షకులు పెద్ద మనసుతో ఆశీర్వదించారు. అన్ని చోట్ల నుంచి చాలా పాజిటివ్ రెస్పాన్స్ వస్తుంది. అందరూ ప్రత్యేకంగా ఫోన్ చేసి అభినందిస్తున్నారు. ఈ జర్నీలో మేం పడ్డ కష్టం ఈ సక్సెస్‌తో మరచిపోయాం. మా నిర్మాత గణపతి రెడ్డిగారి వల్లే సినిమాను ఇంత గ్రాండ్‌గా రిలీజ్ చేయగలిగాం ఈ సక్సెస్‌లో పార్ట్ అయిన ఎంటైర్ టీమ్‌కి థాంక్స్. '' అన్నారు. నిర్మాత టి.గణపతి రెడ్డి మాట్లాడుతూ ''మా అన్వేషి సినిమాను బ్లాక్ బస్టర్ మూవీగా ఆదరించిన ప్రేక్షకులకు శిరస్సు వంచి పాదాభివందనం తెలియజేసుకుంటున్నాను. రెండు వారాలుగా నిద్రహారాలు లేకుండా తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతున్నాం. ఈరోజు ఈ సక్సెస్‌తో మా కష్టం మరచిపోయాం. మా హీరోయిన్ సిమ్రాన్ గుప్తా అయితే ఏ ప్రోగ్రామ్ కండక్ట్ చేసిన అందులో ఆమె ముందుగా పార్టిసిపేట్ చేస్తూ వచ్చారు. సినిమాపై ఆమెకు ఉన్న ప్యాషన్ చూస్తే ముచ్చటేస్తుంది. ఈ సినిమా వల్ల మేం ఎంత వరకు రీచ్ కావచ్చునో అంత వరకు రీచ్ అయ్యాం. చిన్న బ్యానర్స్, సినిమాలంటూ చిన్న చూపు చూడకండి. మా సినిమా రిలీజ్‌కు సపోర్ట్ చేసిన లక్ష్మణ్‌గారికి థాంక్స్. మంచి థియేటర్స్, డిస్ట్రిబ్యూటర్స్‌ను ఆయన ఇచ్చారు. ఆయన చేసిన సాయానికి థాంక్స్. నాగిగారికి, అజయ్ ఘోష్, అనన్య నాగళ్ల సహా అందరూ చక్కగా నటించారు. డైరెక్టర్ వి.జె.ఖన్నాకు మంచి ఫ్యూచర్ ఉంది. హీరో విజయ్, తనకు ఎవరూ లేరని ఫీల్ అయ్యారు. అయితే ఇకపై తనకు మంచి టీమ్ ఏర్పడుతుంది. భవిష్యత్తులో హీరోగా తను మంచి సక్సెస్ సాధిస్తారని నమ్ముతున్నాను. మా దుర్గేష్ మంచి పాత్రను పోషించారు. అలాగే మా ఎంటైర్ టీమ్ శ్రమ ఎంతో ఉండబట్టే ఇక్కడ వరకు రాగలిగాం. మా బ్యానర్‌కు ఇలాగే సపోర్ట్‌ను కొనసాగించాలని కోరుకుంటున్నాం'' అన్నారు.